RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 145 శనివారం 21 జూన్ 2025 పేజీలు : 4

### ఇంగ్లీష్ మాట్లాడేవారు సిగ్గుపడే రోజొస్తుంది

న్యూఢిల్లీ : ఆంగ్ల భాష మాట్లాడేవారు సిగ్గుపడే రోజు వస్తుందని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా అన్నారు. ఆ భాష వలసవాద బానిసత్వానికి చిహ్నమని తెలిపారు. కొన్నాళ్లకు ప్రజలే దానిని తిరస్కరిస్తారని కూడా వ్యాఖ్యానించారు. స్థానిక భాషలతోనే భారతీయ సంస్కృతి, వారసత్వా లకు గుర్తింపు అని.. విదేశీ భాషల స్థానాన్ని అవి ఆక్రమించాలని ఆ కాంక్షించారు. హిం దీని బలవంతంగా రుద్దడాన్ని, నూతన విద్యావిధానం (ఎన్ ఈపీ)లో త్రిభాషా సూత్రాన్ని తమిళనాడులోని డీఎంకే సహా కొన్ని ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. ఢిల్లీలో ఐఏఎస్ అధికారి అశుతోష్ అగ్నిహెూత్రి రచించిన 'మై బూంద్ హూ.. ఖుద్ సాగర్ హూ(నేను నీటి బిందువునే కాదు.. సముద్రాన్ని కూడా)' అనే పుస్తకాన్ని అమిత్‌షా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్థానిక భారతీయ భాషలు దేశం గుర్తింపునకు కీలకమన్నారు. ఆంగ్లం మాట్లాడేవారు త్వరలోనే సిగ్గుపడే పరిస్థితి వస్తుందని.. అలాంటి సమాజం రావడం ఎంతో దూరంలో లేదని తెలిపారు.

# వరల్డ్ రికార్డు దిశగా....

# అంతర్జాతీయ యోగా డే!

## రెండు గిన్నీస్ రికార్డులపై దృష్టి!!




## ఒకే వేదికపై మోడీ - చంద్రబాబు యోగాసనాలు

అమరావతి : ఏపీ సీఎం చంద్రబాబు అరుదైన రికార్డు సాధించబోతున్నారు. ఇప్పటికే అత్యధిక కాలం ఉమ్మడి రాష్ట్ర సీఎంగా పనిచేసిన రికార్డు సొంతం చేసుకున్న చంద్రబాబు.. విభజిత ఏపీ తొలి ముఖ్యమంత్రిగా కూడా ఘనత వహించారు. ఇక పాలనలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి రాష్ట్రంపై తన బ్రాండ్ వేసిన సీఎం.. ఇప్పుడు యోగాంధ్ర కార్యక్రమంతో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు స్థాపించబోతున్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని శనివారం విశాఖలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనికి ప్రధాని మోదీ ప్రత్యేక అతిథిగా వస్తున్నారు. విశాఖలో దాదాపు 5 లక్షల మందితో యోగా నిర్వహించడంతోపాటు ఒకేసారి రాష్ట్రవ్యాప్తంగా 2.30 కోట్ల మంది యోగా నిర్వహించేలా సీఎం చంద్రబాబు ప్లాన్ చేశారు. యోగా డే సందర్భంగా మొత్తం 22 వరల్డ్ రికార్డులు స్థాపించాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనగా చెబుతున్నారు. దీనికోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారని అంటున్నారు. 'యోగా ఫర్ వన్ ఎర్త్-వన్ హెల్త్' నినాదంతో చేపడుతున్న కార్యక్రమంలో 108 నిమిషాల పాటు సూర్య నమస్కారాల కార్యక్రమం నిర్వహించనున్నారు. రాష్ట్రంలో లక్ష 29 వేల ప్రాంతాల్లో యోగా నిర్వహించేలా కార్యక్రమం డిజైన్ చేశారు. అదేవిధంగా విశాఖలో 26 కిలోమీటర్ల పొడవున 326 కంపార్ట్‌మెంట్లను ఏర్పాటు చేశారు. రెండు గిన్నిస్ రికార్డులతోపాటు 22 ప్రపంచ రికార్డులు సాధించడమే టార్గెట్ గా చంద్రబాబు ప్రభుత్వం పనిచేస్తోందని చెబుతున్నారు. ఈ కార్యక్రమం ద్వారా అంతర్జాతీయంగా అందరి దృష్టిని ఆకర్షించాలని భావిస్తున్నారు. గ్రామ, మండల స్థాయిలో కూడా ఎన్నడూ లేని విధంగా యోగా శిబిరాలు పెడుతున్నారు. వాస్తవానికి ఈ కార్యక్రమంలో 2 కోట్ల మందిని భాగస్వాములుగా చేయాలని ముఖ్యమంత్రి భావిస్తే.. 2.30 కోట్ల మంది రిజిస్ట్ చేసుకున్నారు. మొత్తానికి రేపు జరిగే కార్యక్రమంతో అంతర్జాతీయంగా చంద్రబాబు పేరు మార్మోగనుందని అంటున్నారు.

**యోగా డే కోసం విశాఖనే మోడీ ఎందుకు ఎంచుకున్నారు? దీని ప్రత్యేకతలేంటి?...** 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విశాఖపట్నం వేదికగా నిర్వహిస్తున్న నేపథ్యంలో.. జాతీయవ్యాప్తంగానే కాకుండా ప్రపంచవ్యాప్తంగా అందరి దృష్టి విశాఖపట్నం మీద కేంద్రీకృతమైంది. పైగా ఈ కార్యక్రమానికి దేశ ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్య అతిథిగా హాజరవుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం న భూతో న భవిష్యతి అనే స్థాయిలో ఏర్పాట్లు చేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రంలోని కూటమి ప్రభుత్వంలో కీలకంగా ఉన్న నేపథ్యంలో.. ప్రధానమంత్రి రాక ప్రాధాన్యం సంతరించుకుంది. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని "యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్" అనే థీమ్ తో నిర్వహిస్తున్నారు. ఇదే విషయాన్ని దేశ ప్రధాని మార్చి 30న మన్ కీ బాత్ కార్యక్రమంలో వెల్లడించారు.

**విశాఖపట్నం ఎందుకంటే..** విశాఖపట్నం లో ఎన్నో విశిష్టతలు ఉన్నాయి. భౌగోళికంగా ఈ నగరం ఎంతో విశాలమైంది. అత్యంత సుందరమైన సముద్రతీరం ఉంది. విస్తారమైన సముద్రం ఉంది. ప్రకృతి పరంగా కూడా ఈ నగరానికి అనేక విశిష్టతలు ఉన్నాయి. విశాఖపట్నంలో ఆర్కే బీచ్ ప్రపంచ ప్రఖ్యాతి పొందింది. విశాఖ నగరానికి దగ్గర్లో అనేక ఆలయాలు.. ప్రకృతి రమణీయతను పెంపొందించే పర్యాటక కేంద్రాలు ఉన్నాయి. అందువల్లే నరేంద్ర మోడీ ఈ నగరాన్ని 11 అంతర్జాతీయ యోగా దినోత్సవానికి కేంద్రంగా చేసుకున్నారు. దీనివల్ల పర్యాటకంగా విశాఖపట్నం నగరానికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభిస్తుంది. ఈ నగరాన్ని సందర్శించడానికి వచ్చే పర్యాటకుల సంఖ్య పెరుగుతుంది.

**గిన్నిస్ వరల్డ్ రికార్డు లక్ష్యంగా..** ఆర్కే బీచ్ లో యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించడానికి భారీగా ఏర్పాటు చేశారు. ఆర్కే బీచ్ నుంచి భీమిలి ప్రాంతం వరకు ఏకంగా 26.5 కిలోమీటర్ల తీర ప్రాంతంలో యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ ప్రాంగణంలో దాదాపు 2.5 లక్షల మంది యోగా దినోత్సవం లో పాల్గొంటారు. వీరందరికీ యోగా మ్యాట్లు, టీ షర్టులు పంపిణీ చేస్తారు. 2023లో గుజరాత్ రాష్ట్రంలోని సూరత్ ప్రాంతంలో యోగా దినోత్సవం నిర్వహించారు. నాడు 1.53 లక్షల మంది యోగా దినోత్సవం లో పాల్గొన్నారు. అప్పట్లో అది ప్రపంచ రికార్డు సృష్టించింది. ఇప్పుడు ఈ ఘనతను విశాఖపట్నం అధిగమించే అవకాశం ఉంది. ఇక ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్లోని కూటమి ప్రభుత్వం యోగాంధ్ర అని పేరు పెట్టింది. యోగాంధ్ర కార్యక్రమంపై విస్తృతంగా ప్రచారం చేస్తుంది. అంతేకాదు గడిచిన నెలలో 21 తేదీ నుంచి ఈ నెల 21 వరకు నెల రోజులపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విస్తృతంగా యోగా దినోత్సవం నిర్వహిస్తున్నారు. యోగ పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రజలకు ఆరోగ్య ప్రాముఖ్యత గురించి వివరిస్తున్నారు. అత్యంత ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. గడచిన నెల 21 నుంచి మొదలైన యోగాంధ్ర కార్యక్రమం.. ఈనెల 21న ముగుస్తుంది.

## తెలంగాణ ప్రజలకు బిగ్‌షాక్.. ఆర్టీసీ టికెట్ల ధర భారీగా పెంపు




హైదరాబాద్ : తెలంగాణ ప్రజలకు ఆర్టీసీ భారీ షాక్ ఇస్తోంది. ఇప్పటికే బస్సు పాస్ ఛార్జీలు పెంచిన ఆర్టీసీ తాజాగా మరో భారం మోపుతోంది. టోల్ గేట్ల ఫీజు పెంచారనే నెపంతో టికెట్ ఛార్జీలు పెంచారని చర్చ జరుగుతోంది. ఛార్జీల పెంపుతో ప్రయాణికులపై భారీ భారం పడింది. దాదాపు రూ.10 మేర ధర పెంచినట్లు ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. అధికారికంగా ప్రకటించకుండా రహస్యంగా ఇలా ఛార్జీల భారం మోపడంపై తీవ్ర దుమారం రేపుతోంది. మహాలక్ష్మి పథకం అమలుతో ప్రజలపై అదనపు భారం మోపుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. తెలంగాణ ఆర్టీసీ అన్ని ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసుల్లో టికెట్ రేట్లు రూ.10 మేర పెంచినట్లు తెలుస్తోంది. ఇప్పటికే టోల్ గేట్లు ఉన్న మార్గాల్లో ఒక్కో టోల్‌గేటుకు రూ.10 చొప్పున అదనంగా వసూలు చేస్తున్నారు. హేతుబద్ధీకరణ పేరిట అన్ని ఎక్స్‌ప్రెస్‌ల్లో ఈ ధరల పెంపు అమలవుతోంది. ఈ అదనపు భారంపై ప్రయాణికులు మండిపడుతున్నారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) టోల్ ఛార్జీలు పెంచిందనే సాకుతో ఆర్టీసీ యాజమాన్యం ప్రయాణికులపై అదనపు చార్జీల భారాన్ని మోపుతోంది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా టోల్ గేట్లు ఉన్న మార్గాల్లో ఎక్స్‌ప్రెస్ బస్సుల నుంచి టోల్‌గేటుకు రూ.10 చొప్పున ప్రయాణికుల నుంచి వసూలు చేస్తోంది. రేషనలైజేషన్ పేరిట రాష్ట్రంలోని అన్ని రకాల ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసుల్లో టికెట్ రేట్లను రూ.10 పెంచింది. ఉదాహరణకు నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్లాలంటే మూడు టోల్‌గేట్లు దాటాల్సి ఉంది. దీంతో టికెట్ రేటుకు అదనంగా ఆర్టీసీ ప్రయాణికుల నుంచి రూ.30 వసూలు చేశారు.

**ధరల మార్పు...** గతంలో హైదరాబాద్‌కు ఏసీ బస్సుల్లో టికెట్ రూ.430 ధర ఉండగా.. ప్రస్తుతం రూ.460 వసూలు చేస్తున్నారు. ఎక్స్‌ప్రెస్, ఎలక్ట్రిక్ బస్సుల్లో టికెట్ రూ.360 ఉండగా 390కి పెంపు.

**రామగుండం మార్గంలో...** హైదరాబాద్ నుంచి రామగుండం వెళ్లే మార్గంలోనూ 3 టోల్‌గేట్లు ఉన్నాయి. ఈ మార్గంలోనూ ప్రయాణికుల నుంచి అదనంగా రూ.30 వసూలు చేస్తున్నారు. కిలోమీటర్ల రేషనలైజేషన్ పేరిట అన్ని ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో టికెట్ల రేట్లను ప్రస్తుత చార్జీలతో సంబంధం లేకుండా రూ.10 చొప్పున పెంచారు.

కరీంనగర్ నుంచి పెద్దపల్లి వరకు ఎక్స్‌ప్రెస్ టికెట్ రూ.60 నుంచి రూ.70కి పెంపు

కరీంనగర్ నుంచి మంథని వరకు రూ.100 నుంచి 110కి పెరుగుదల

**వరుస ఛార్జీలు...** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్టీసీ భారీగా వడ్డన చేస్తోంది. గతంలో చిల్లర సమస్య సాకుతో టికెట్ రేట్లను రౌండ్ ఫిగర్ చేస్తున్నామని చెప్పి చార్జీలను పెంచిన విషయం తెలిసిందే. ఎలక్ట్రికల్ బస్సుల్లో గ్రీన్ టాక్స్ పేరిట అదనంగా రూ.10 వసూలు చేస్తున్నారు.


**వారికి ఉచితం.. మాకు భారం...** మహాలక్ష్మి పథకంతో ఉచిత బస్సు ప్రయాణంతో ఆర్టీసీ సేవలు సాధారణ ప్రజలకు భారంగా మారాయి. బస్సుల్లో సీట్లు ఖాళీగా ఉండడం లేదు. అరకొర బస్సుల్లో నిలబడి వెళ్తున్న ప్రయాణికులకు కొత్తగా టోల్ పేరిట అదనపు ఛార్జీలు వసూలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్‌లో బస్సు ఛార్జీలు పెంచిన ఆర్టీసీ ఇప్పుడు టోల్ పేరిట ధరలు పెంచడం ఏమిటని ప్రయాణికులు నిలదీస్తున్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించి.. పురుషులపై అదనపు భారం మోపడం సరికాదని చెబుతున్నారు. ఈ వ్యవహారంపై త్వరలో బీఆర్ఎస్ పార్టీతోపాటు బీజేపీ, వామపక్షాలు పోరాటానికి సిద్ధమవుతున్నాయి.



## ఫోన్ ట్యాపింగ్ కేసు..

### ఐదో విడత ప్రభాకర్‌రావును సుదీర్ఘంగా ప్రశ్నించిన సిట్

హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును శుక్రవారం సిట్ అధికారులు సుదీర్ఘంగా విచారించారు. జూబ్లీహిల్స్ పీఎస్‌లోని సిట్ కార్యాలయంలో 8 గంటలకు పైగా ప్రశ్నించారు. ఇప్పటికే ఈనెల 9, 11, 14, 19 తేదీల్లో విచారించిన సిట్ అధికారులు .. ఇవాళ నిందితులు.. సాక్షుల వాంగ్మూలాల ఆధారంగా ప్రశ్నించినట్లు సమాచారం. విచారణలో ప్రభాకర్‌రావు సిట్‌కు పూర్తిగా సహకరించలేదని సమాచారం. కీలకమైన ప్రశ్నలకు సమాధానాలు దాటవేసినట్లు తెలుస్తోంది. దర్యాప్తునకు ప్రభాకర్‌రావు సహకరించడం లేదని సిట్ అధికారులు కోర్టుకు తెలిపే అవకాశముంది.



## గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై చంద్రబాబుతో చర్చలకు సిద్ధం

### కేబినెట్‌లో బనకచర్ల ప్రాజెక్టుపై సమగ్రంగా చర్చిస్తాం - సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్: గోదావరి – బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చలు జరిపేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎవరితోనూ వివాదాలు కోరుకోవడం లేదని, అయితే తెలంగాణ హక్కులను మాత్రం వదులుకునే ప్రసక్తే లేదని ఆయన తేల్చి చెప్పారు. శుక్రవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన రేవంత్ రెడ్డి, పలు కీలక అంశాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తొలుత తెలంగాణను సంప్రదించకుండా నేరుగా కేంద్ర ప్రభుత్వానికి ప్రాథమిక సాధ్యసాధ్యాల నివేదిక (పీఎఫ్ఆర్) సమర్పించడమే ప్రస్తుత వివాదానికి మూలకారణమని రేవంత్ రెడ్డి అన్నారు. 'పీఎఫ్ఆర్ ఇచ్చే ముందే మాతో చర్చించి ఉంటే ఈ వివాదం ఉండేది కాదు. కేంద్రానికి ఏపీ నివేదిక ఇవ్వగానే, కేంద్రం కూడా అన్ని రకాల చర్యలకు సిద్ధమవుతోంది' అని ఆయన వివరించారు. ఈ అంశంపై చర్చించేందుకు తమకు ఎలాంటి బేషజాలు లేవని, ఇద్దరు ముఖ్యమంత్రులు కూర్చుని ప్రాజెక్టుల వారీగా సమస్యలపై మాట్లాడుకుందామని ఆయన సూచించారు. 'ఒక రోజు కాదు, అవసరమైతే నాలుగు రోజులైనా చర్చిద్దాం. రాష్ట్రాల మధ్య జలవివాదాలు చర్చల ద్వారానే పరిష్కారమవుతాయి. న్యాయ, సాంకేతిక అంశాలను పరిశీలిద్దాం' అని రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ నెల 23న తెలంగాణ రాష్ట్ర కేబినెట్ సమావేశం జరగనుందని, ఈ భేటీలో బనకచర్ల అంశంపై సమగ్రంగా చర్చించిన తర్వాత, ఆంధ్రప్రదేశ్ను అధికారికంగా చర్చలకు ఆహ్వానిస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. 'ఒక అడుగు ముందుకేసి మేమే ఏపీని చర్చలకు పిలుస్తాం. తెలుగువారి మధ్య అనవసరమైన సమస్యలు ఉండొద్దు. పైన, కింద ఉన్న రాష్ట్రాలతో వివాదం కోరుకోవట్లేదు' అని ఆయన అన్నారు. విభజన చట్టంలోని అంశాలను పరిష్కరించుకునేందుకు ఇప్పటికే అధికారులు, మంత్రుల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కృష్ణా, గోదావరి జలాల విషయంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, తెలంగాణ హక్కులను ఆంధ్రప్రదేశ్కు ధారాదత్తం చేసిందని ఆరోపించారు. 'నీళు ,, నిధుల పేరిట బీఆర్ఎస్ నేతలు మోసపూరిత సెంటిమెంట్ను అడ్డుపెట్టుకున్నారు. రాయలసీమను రత్నాలసీమ చేస్తానని కేసీఆర్ అన్నారు. గోదావరి జలాలను ఏపీ ఉపయోగించుకుంటే తప్పేంటని కూడా గతంలో వ్యాఖ్యానించారు. కృష్ణా, గోదావరి జలాలపై తెలంగాణ హక్కులను ఏపీకి రాసిచ్చింది కేసీఆర్, హరీశ్ రావులే' అని రేవంత్ రెడ్డి ఆరోపించారు. తాను కృష్ణా జలాల్లో 500 టీఎంసీలకు బ్లాంకెట్ ఎన్‌ఓసీ అడిగితే మాజీ మంత్రి హరీశ్ రావు తప్పుపడుతున్నారని, ఆయన వాదనలో పసలేదని అన్నారు. 2023లో కేంద్రానికి హరీశ్ రావు రాసిన లేఖలో కేవలం 405 టీఎంసీలు మాత్రమే తెలంగాణకు అడిగారని గుర్తుచేశారు. 'విభజన చట్టంలో పోలవరానికి మాత్రమే అనుమతి ఉంది. బనకచర్ల అనేది పోలవరానికి అనుబంధ ప్రాజెక్టు. దీనిపై తెలంగాణ అభిప్రాయం తప్పక తీసుకోవాల్సిందే. గోదావరిలో 968 టీఎంసీలు వాడుకునే వెసులుబాటు తెలంగాణకు ఉంది. కానీ, కేటాయించిన నీటిని వాడుకునేందుకు అవకాశం ఇవ్వకపోవడంతోనే వివాదాలు తలెత్తుతున్నాయి' అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కోర్టుకు వెళ్లడం కంటే ముందుగా చర్చించుకోవడమే ఉత్తమమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ వివాద పరిష్కారానికి ఎలాంటి కాలపరిమితి లేదని స్పష్టం చేశారు. జూలై 6, 7 తేదీల్లో మరోసారి ఢిల్లీలో పర్యటించనున్నట్లు ఆయన తెలిపారు. అధికారం కోల్పోయిన అసహనంతోనే హరీశ్ రావు విమర్శలు చేస్తున్నారని, తెలంగాణకు అన్యాయం చేసింది కేసీఆర్, హరీశ్ రావులేనని పునరుద్ఘాటించారు. కేటీఆర్కు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లైజనింగ్ అధికారిగా పని చేస్తున్నారని, కేసీఆర్కు కాళేశ్వరం ఏటీఎంలా మారిందని ప్రధాని మోదీ, అమిత్ షా గతంలో అన్నారని గుర్తుచేశారు. దీనిపై కిషన్రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# సంపాదకీయం

## విమాన ప్రమాదం...

### ఎయిరిండియా బ్లాక్ బాక్స్ కు ఏమైంది?

అహ్మదాబాద్ లో జూన్ 12న జరిగిన ఘోర విమాన ప్రమాదం అందరినీ తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిన సంగతి తెలిసిందే. విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయిన విమానం.. కొద్దిసేపటికే కుప్పకూలింది. ఈ ప్రమాదంలో విమానంలో ఉన్న 242 మందిలో 241 మంది ప్రయాణికులు, సిబ్బంది మృతి చెందారు. ఈ సమయంలో ఇటీవల ఆ విమానం బ్లాక్ బాక్స్ దొరికింది. విమానం ఢీకొన్న రెసిడెంట్ డాక్టర్స్ హాస్టల్ భవనం పైకప్పు వద్ద ఈ పరికరాన్ని ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) బృందం స్వాధీనం చేసుకొంది. ఇందులో ఉండే ఫ్లైట్ డేటా రికార్డర్ (ఎఫ్.డీ.ఆర్), కాక్ పీట్ వాయిస్ రికార్డర్ (సీ.వీ.ఆర్)లు ప్రమాద దర్యాప్తులో అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తాయని అంటున్నారు. ఇలా.. ఈ ప్రమాద దర్యాప్తులో అత్యంత కీలకమైన ఈ బ్లాక్ బాక్స్ దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. దీంతో... అందులోని డేటాను విశ్లేషించేందుకు దాన్ని విదేశాలకు పంపించేందుకు సిద్ధమైనట్లు అధికార వర్గాలు వెల్లడించాయని జాతీయ మీడియాలో కథనాలొస్తున్నాయి. ఇందులో భాగంగా.. అమెరికాలోని జాతీయ రవాణా భద్రతా బోర్డుకు పంపే అవకాశాలు ఉన్నాయని సమాచారం. ఇలా.. అత్యంత కీలకమైన ఈ బ్లాక్ బాక్స్ ను అమెరికాలోని వాషింగ్టన్ డీసీకి పంపే సమయంలో ప్రొటో కాల్స్ పాటించడంతో పాటు భారత్ కు చెందిన అధికారుల బృందం కూడా వెళ్తుందని అధికారులు తెలిపినట్లు తెలుస్తోంది. అయితే... దీనిపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని అంటున్నారు. కాగా... ఈ బ్లాక్ బాక్స్ లో ఫ్యాక్ చేయబడిన రెండు భాగాలు ఉంటాయి. అందులో ఒకటి ఫ్లైట్ డేటా రికార్డర్ (ఎఫ్.డీ.ఆర్). ఇది విమాన వేగం, ఎత్తు, ఇంజిన్ పనితీరు, నావిగేషన్ వివరాలు వంటి సంకేతిక డేటాను రికార్డ్ చేస్తుంది. ఇక రెండోది.. కాక్ పీట్ వాయిస్ రికార్డర్ (సీ.వీ.ఆర్). ఇది పైలట్ సంభాషణలు, ఫ్లైట్ డెక్ నుంచి వచ్చే ఇతర శబ్దాలను సేవ్ చేస్తుంది. ఈ రెండు రికార్డులు కలిసి 25 గంటలకు పైగా విమాన డేటాను, రెండు గంటల వాయిస్ రికార్డింగులను నిల్వ చేయగలవు. సాధారణంగా విమానం ముందు వైపు కూలిపోతుంది కాబట్టి.. క్రాష్ ప్రూఫ్ పరికరం విమానం తోక దగ్గర ఉంటుంది. ఈ పరికరం క్రాష్ తర్వాత అనేక సందేహాలకు సమాధానాలను ఇస్తుందని అంటారు.

## లబ్ధిదారుడికి ముఖ్యమంత్రి సహాయ నిధి అందజేసిన ఎమ్మెల్యే



శామీర్ పేట, (గరుడ వార్త): ముఖ్యమంత్రి సహాయ నిధిని అర్హులు అందరూ తప్పక సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మల్లారెడ్డి కోరారు. శామీర్ పేట మండలం మజీద్ పూర్ కు చెందిన అబ్బగాని ఆనంద్ ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా రూ. 31500 మంజూరు అయ్యాయి. మంజూరైన చెక్కును అబ్బగౌని ఆనంద్‌కు శుక్రవారం ఎమ్మెల్యే మల్లారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడు తూ ముఖ్య మంత్రి సహాయ నిధి పేదల పాలిటి పెన్నిదని, లబ్ధిదారులు ము ఖ్యమంత్రి సహాయ నిధిని సక్రమంగా సద్వినియం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ మండల అధ్యక్షుడు మోహన్ రెడ్డి, నాయకుడు వంగ వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సంరక్షణ లోపం.. లక్ష్యాలపై ప్రభావం



పెద్దపల్లి : ఓవైపు వానాకాలం సమీపిస్తుండగా ఊరూరా నాటాల్సిన మొక్కలు సిద్ధం కాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. వేసవి ఎండల తీవ్రతతో నర్సరీల్లోని మొక్కలు ఎండిపోతున్నాయి. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపంతో మౌలిక వసతులు కరవయ్యాయి. వన మహోత్సవంలో భాగంగా వివిధ శాఖల భాగస్వామ్యంతో ఈ ఏడాది జిల్లాలో 30.44 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు నాటడానికి స్థలాలు ఎంపిక చేస్తున్నారు. ఏటా పెద్ద పరిమాణం కలిగిన మొక్కలు నాటాలని భావిస్తుండగా ఎదగకపోవడం లక్ష్యాలపై ప్రభావం చూపుతోంది.

**నీడ, పండ్ల మొక్కలే అధికం**

జిల్లాలో రామగుండం నగరపాలిక, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ పురపాలికలు, 266 పంచాయతీల పరిధిలో నర్సరీలు ఏర్పాటు చేశారు. ఆహ్లాదం, నీడ, పండ్ల మొక్కల పెంపకానికి ప్రాధాన్యమిస్తున్నారు. టేకు, ఈత, వెదురు, మలబార్, ఇప్ప, మద్ది, వెలగ, మర్రి, వేప, రేల, బాదం, రావి, చింత, తులసి, నిమ్మ, జామ, సీతాఫలం, కర్జూర, మందార, సన్నజాజి, మల్లె తదితర రకాల విత్తనాలు నాటి పెంచుతున్నారు. ఊరూరా ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేసేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు.

**రక్షణ మృగ్యం**

గ్రామీణాభివృద్ధి, అటవీ శాఖలు, నగర/పురపాలికలు, సింగరేణి ఆధ్వర్యంలో వేర్వేరుగా నర్సరీలు ఏర్పాటు చేశారు.
మండుతున్న ఎండల నుంచి మొక్కలను రక్షించేందుకు పరదాలు ఏర్పాటు చేసుకోవాల్సి ఉండగా పంచాయతీల్లో నిర్లక్ష్యం కనిపిస్తోంది. చాలా చోట్ల నర్సరీల్లో రక్షణ వ్యవస్థ(ఫెన్సింగ్) లేక పశువులు సంచరిస్తున్నాయి.

ఎదుగుదల లోపమే ప్రధాన సమస్య

గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 26.47 లక్షల మొక్కల పెంపకానికి విత్తనాలు నాటగా 22.54 లక్షల మొక్కలు బతికాయి. మొక్క ఎత్తు కనీసం మీటరున్నర ఉండాలి. పంచాయతీల్లో గతేడాది నాటిన 1.58 లక్షల మొక్కలు అందుబాటులో ఉన్నాయి.
మున్సిపాలిటీలు, అటవీ శాఖ, సింగరేణి వేర్వేరుగా నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కలు పెంచుతున్నాయి. నాసిరకమైన విత్తనాలు నాటడంతో మొక్కల ఎదుగుదలలో లోపం కనిపిస్తోంది.
గ్రామాల్లో సామూహిక ప్రాంతాలు, రహదారికి ఇరువైపులా మొక్కలు నాటేందుకు అవసరమైన స్థలాలను ఎంపిక చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 4.87 లక్షలు మొక్కలు నాటేందుకు 490 ప్రాంతాల్లో స్థలాలు గుర్తించారు. ఏటా వర్షాలు కురిసిన వెంటనే హడావుడిగా చిన్న మొక్కలను నాటుతుండటంతో చనిపోతున్నాయి. అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టకపోవడం లక్ష్యాలపై ప్రభావం చూపుతోంది.

స్థలాలు గుర్తిస్తున్నాం

జిల్లాలోని నర్సరీల్లో నాణ్యమైన మొక్కలు ఎదిగేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. పంచాయతీల్లో నీడ కోసం గ్రీన్‌షేడ్ పరదాలు ఏర్పాటు చేశాం. పెద్ద పరిమాణం కలిగిన మొక్కలు అందుబాటులో ఉండేలా పర్యవేక్షిస్తున్నాం. వర్షాలు కురిసిన వెంటనే నాటేలా స్థలాలను గుర్తిస్తున్నాం.
కాళిందిని, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిణి

## మామిడి.. సమస్యల ఒరవడి



జగిత్యాల : జిల్లాలో మామిడిని పండించి జగిత్యాల బ్రాండ్ పేరిట దేశవ్యాప్తంగా ఎగుమతి చేస్తున్న సాగు ఇటీవల తీవ్ర ఒడుదొడుకులకు గురవుతోంది. చీడపీడలు, ప్రతికూల వాతావరణంతో పాటు కొనుగోళ్ల మాయాజాలం, ధరాఘాతంతో కునారిల్లుతున్న పరిస్థితి తలెత్తుతోంది.

**ధరాఘాతం**

ఈ సీజన్‌లో జగిత్యాల, కోరుట్ల, మెట్పల్లి, మేడిపల్లి, రాయికల్‌లలో ఇప్పటి వరకు 2.25 లక్షల క్వింటాళ్ల మామిడికాయలను కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలించారు. 125 మంది లైసెన్స్ పొందిన వ్యాపారులుండగా సగం మందే కొనుగోలు చేస్తుండటం, కొందరు బహిరంగ వేలం పద్ధతి, మరికొందరు గ్రేడింగ్ విధానం అనుసరించటం, మండీపై అధికారులు పట్టుకోల్పోవడంతో ధరల్లో స్థిరత్వం లోపించింది. సీజన్ ఆరంభంలో క్వింటా బంగినపల్లి రూ.65 వేలు పలకగా.. ప్రస్తుతం రూ.20-40 వేలకు తగ్గటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. కొందరు వ్యాపారులు నేరుగా రైతుల తోటల వద్దకు వెళ్లి కాయలను పెట్టెల్లో నింపి వాహనాల ద్వారా నేరుగా ఇతర రాష్ట్రాలకు తరలిస్తుండటంతో మార్కెట్ యార్డుల అజమాయిషీ కొరవడి ధరాఘాతం.. మార్కెట్ ఫీజు చెల్లించకపోవటం.. తక్కువగా చెల్లించటం రివాజుగా మారింది. తరుగు, చిన్నకాయలు, కమీషన్ పేరిట నష్టపరుస్తున్న చర్యలను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

**ఈ చర్యలు అవసరం**

వ్యాపారులందరూ ఒకేతీరుగా కాయల కొనుగోలు జరిపేలా చర్యలు చేపట్టాలి. యార్డుల వెలుపల, తోటల వద్ద క్రయ విక్రయాలన్నీ తక్‌పట్టీల ప్రకారమే జరిగేలా చూడాలి.
అన్ని ప్రాంతాల్లోనూ కాయల సేకరణను మార్కెటింగ్‌శాఖ పర్యవేక్షణలోకి తేవాలి. వ్యాపారులు కొనుగోలు చేసిన సరకు విలువకు సరిపడా తక్‌పట్టీ రాసి మార్కెట్ ఫీజు వసూలు చేయాలి.
రైతుల నుంచి కమీషన్ తీసుకుంటున్నారని.. అదనంగా తరుగు, చిన్నకాయల పేరిట 5-10 శాతం వరకు కోత విధిస్తున్నారని రైతుల అరోపణల నేపథ్యంలో దీన్ని అరికట్టాలి.
ధరలో స్థిరత్వం తెచ్చేలా అపెడా, ఉద్యానశాఖ, మహిళా సంఘాలు, ఎఫ్‌పీవోల ద్వారా మామిడి కాయలను సేకరించి ఇతర ప్రాంతాలకు తరలించాలి. ప్రకృతి విపత్తులతో వాటిల్లే నష్టానికి పరిహారం అందించాలి.
లైసెన్స్ పొందిన వ్యాపారులు కాయలను కొనేలా చూస్తున్నామని.. ఇతర పండ్ల మార్కెట్లలో పలికే ధరల ప్రదర్శన, యార్డుల్లో సదుపాయాల కల్పన, ప్రభుత్వ కాంటాలపై ఉచిత తూకం తదితరాలతో రైతులకు ఆసరాగా నిలుస్తున్నామని మార్కెటింగ్‌శాఖ అధికారి ప్రకాశ్ పేర్కొన్నారు.

ధరలో స్థిరత్వం ఉండాలి

మామిడి ధరలో స్థిరత్వం ఉండేలా ప్రభుత్వరంగ సంస్థలు మధ్యవర్తిత్వం వహించాలి. ఏకమొత్తంగా కొనే కంపనీలు, ఎగుమతి చేసే సంస్థలకు కాయలను విక్రయించే వీలు కల్పించాలి.
సత్యనారాయణరెడ్డి, రైతు

కొనుగోలుపై అజమాయిషీ ముఖ్యం

లైసెన్స్ పొందినవారంతా బీటులో కాయలను కొనేలా, దిల్లీ వ్యాపారులు నేరుగా దిగుమతి చేసుకునేలా చర్యలుంటే లాభం ఉంటుంది. చల్‌గల్ మార్కెట్లోనే కాయల క్రయవిక్రయాలు జరపాలి.
బి.మల్లయ్య, రైతు

## క్వింటాకు 99 కిలోలే!

ఏదులాపురం : బియ్యం తరుగు.. రేషన్ డీలర్లపాలిట శాపంగా మారింది. బఫర్ పాయింట్ నుంచి కాటా వేసుకొని ఎంఎల్ఎస్ గోదాములకు తీసుకొచ్చి నేరుగా డీలర్లకు పంపిణీ చేస్తున్నారు. ఎక్కడ మతలబు జరుగుతుందో కాని డీలర్లు తమకు క్వింటాకు కిలో తరుగు వస్తోందని వాపోతున్నారు. పౌరసరఫరాలశాఖ అధికారులు మాత్రం తాము పక్కాగా తూకం వేసి డీలర్లకు అందిస్తున్నామని చెబుతున్నారు. ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద తూకం వేస్తే తమకు న్యాయం జరుగుతుందని డీలర్లు వాదిస్తున్నారు. అనుమానం ఉంటే బఫర్ పాయింట్ వద్దకు వెళ్లి తనఖీ చేసుకోవాలని పౌరసరఫరాలశాఖ అధికారులు బదులిస్తున్నారు. డీలర్లు దుకాణంలో కాటా వేస్తే 50కిలోలు ఉండాల్సిన బియ్యం బస్తా 49.50 కిలోలు చూపిస్తోంది. అంటే క్వింటాకు ఒక కేజీ తరుగు కనిపిస్తోంది. ఈ తరుగును పూరించాలంటే డీలర్లు ఏదో మాయ చేయక తప్పని పరిస్థితి నెలకొంది. డీలర్ల వద్దనున్న కాటా మిషన్‌ను తనిఖీ చేయాల్సిన తూనికల కొలతల శాఖ అటువైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాటా యంత్రాలు సరిగా పనిచేయకపోతే ఇటు లబ్ధిదారులు, ఎంఎల్ఎస్ కేంద్రం వద్ద తమకు పక్కాగా కాటా వేసి 50 కిలోలు బస్తాలు సరఫరా చేయాలని జిల్లావ్యాప్తంగా డీలర్లు డిమాండ్ చేస్తున్నా సివిల్ సప్లయ్ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తన దుకాణంలో పరిధిలో ఎఫ్ఎస్‌సీ కింద 608 కార్డులు, ఏఎఫ్ఎస్



కింద 66 కార్డుదారులకు మే మాసానికి 132.52 క్వింటాళ్ల సన్నబియ్యం దిగుమతైంది. ఏప్రిల్, మే కలిపి దాదాపు 1.32 క్వింటాళ్ల తరుగు కనిపిస్తోంది. దీన్ని ఎలా పూరించాలో తెలియని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని 21 మండలాల పరిధిలో 748 రేషన్ దుకాణాదారులున్నాయి. బీపీఎల్ కింద 4,11,990 కార్డులు, ఎఫ్ఎస్‌సీ కింద 27,253 కార్డుదారులు ఉన్నారు. వీరికి ప్రతినెలా 7,618.457 మెట్రిక్ టన్నుల బియ్యం అందజేస్తున్నారు.
డీలర్లకు అనుమానం ఉంటే వే్బ్రిడ్జి కాటా వద్దకు వచ్చి తనిఖీ చేసుకోవచ్చు. పక్కాగా 50 కిలోలు ఉంటుంది. ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లను బఫర్ గోదాంలో పెట్టాం. ఎంఎల్ఎస్ పాయింట్‌లో ఇన్‌ఛార్జిలకు వేమెంట్ పెట్టుకొనేందుకు నగదు చెల్లిస్తున్నాం. గతంలో వేమెంట్ చూసుకొనే అవకాశం ఉండేది కాదు.సన్న బియ్యం వచ్చాక ఆ పరిస్థితి లేదు. శ్రీలత, పౌరసరఫరాలశాఖ డీఎం

## 'సర్వే'త్రా ఆసక్తి

ఖమ్మం: భూ భారతి చట్టం అమలులో భాగంగా భూసమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం పూనుకుంది. ప్రధానంగా భూమి సర్వే చేయటం ద్వారా అనేక సమస్యలు పరిష్కారమవుతాయని ఉన్నతాధికారులు గుర్తించారు. ఇందుకు ప్రైవేట్ లైసెన్స్‌డ్ సర్వేయర్లను వినియోగించుకోవాలని నిర్ణయించారు. పాలిటెక్నిక్, ఐటీఐ సివిల్, బీటెక్ చదివిన వారికి సర్వే శిక్షణ అందించి క్షేత్రస్థాయిలో వినియోగించుకోనున్నారు. పైగా నిరుద్యోగులకు ఉపాధి కల్పించినట్లు అవుతుంది. లైసెన్స్‌డ్ సర్వేయర్ శిక్షణ కోసం ఈ నెల 17 వరకు మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. ఖమ్మం జిల్లాలో 647, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 426 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ఈనెల 26 నుంచి ఆయా జిల్లా కేంద్రాల్లో శిక్షణ అందించనున్నారు. 50 పనిదినాల్లో శిక్షణ పూర్తి చేయనున్నారు. ఖమ్మంలోని టీటీడీసీ భవనంలో తర్ఫీదు ఇవ్వాలని భావిస్తున్నారు. అభ్యర్థులు ఎక్కువ మంది ఉన్నందున మరో భవనం లేదా ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలను గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అభ్యర్థులకు శిక్షణ ఇచ్చేందుకు రెండు భవనాలు అవసరమని నిర్ణయించారు.
భూమి రిజిస్ట్రేషన్‌కు అధీకృత మ్యాప్ (పటం) జతచేయాలని ఇప్పటికే చట్టంలో మార్పులు తీసుకొచ్చారు. లైసెన్స్ పొందిన వారికి భవిష్యత్తులో ఉపాధి లభిస్తుంది. ఇప్పటికే మున్సిపాలిటీల పరిధిలో ప్రైవేట్ లైసెన్స్‌డ్ సర్వేయర్లు ఉన్నా వీరి సంఖ్య చాలా తక్కువ. దరఖాస్తు చేసుకున్న వారికి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సోమవారం నుంచి శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఖమ్మం, భద్రాద్రి జిల్లాల ఏడీ శ్రీనివాసులు తెలిపారు.
**విశ్రాంత సర్వేయర్లతో శిక్షణ** లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ ఇచ్చేందుకు విశ్రాంత సర్వేయర్లను వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. విశ్రాంత సర్వేయర్లు ఖమ్మం జిల్లాలో ఆరుగురిని, భద్రాద్రి జిల్లాలో ఒకరిని గుర్తించింది. వీరితో పాటు మరికొందరు అవసరమని ఆయా జిల్లాల అధికారులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా విశ్రాంత సర్వేయర్ల కొరత నెలకొంది. లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ అందించేందుకు ఇంకా ఎవరిని వినియోగించుకోవచ్చు అనే అంశాన్ని హైదరాబాద్‌లోని ఉన్నతాధికారులు సమీక్షిస్తున్నట్లు తెలిసింది. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి లైసెన్స్ సర్టిఫికెట్ ఇస్తారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లు భవిష్యత్తులో భూమి సర్వే చేసి, మ్యాప్ (పటం) ఇస్తేనే వ్యవసాయ భూములు, ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ అవుతాయి.

## నైపుణ్యమే ఉద్యోగ సోపానం

ఖమ్మం : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు కలిపి మొత్తం పది ఇంజినీరింగ్ కళాశాలలున్నాయి. వీటికి ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించి ంది. దీంతో చాలామంది సరదాగా గడపాలని భావించడం సహజం. ఈ సెలవులను సద్వినియోగం చేసుకుని తమను తాము మెరుగుపరుచుకునే అవకాశముంటుందని పలువురు విద్యావేత్తలు సలహా ఇస్తున్నారు. నేటి పోటీ ప్రపంచంలో నైపుణ్యం కలిగిన యువత అవసరం పెరిగిన నేపథ్యంలో అదనపు జ్ఞానం, అనుభవాన్ని పొందటం కీలకం. ప్రతి విద్యార్థి వేసవిలో కనీసం ఒకటి లేదా రెండు కోర్సులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలని, ఒక ఇంటర్న్‌షిప్‌నకు సైతం దరఖాస్తు చేసుకోవటం మంచిదంటు న్నారు. ఇప్పుడు తీసుకున్న చిన్న నిర్ణయం రాబోయే రోజుల్లో అపార అవకాశాలకు ఉపయోగపడుతుందని చెబుతున్నారు. విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుని ముందుకు సాగాలని ఉద్బోధిస్తున్నారు.

**స్వీయ అనుభవంతో నేర్చుకునేలా...**

ఈ కోర్సులను స్వీయ అనుభవంతో నేర్చుకునేలా రూపొందించారు. చివరి సంవత్సరం పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే సంస్థ నుంచి సర్టిఫికెట్ సైతం లభిస్తుంది. ఇది విద్యార్థుల రెస్యూమ్‌లో, లింక్డెన్ ప్రొఫైల్‌లో విలువ పెంచుతాయి. పరిశ్రమల్లో వీటి ప్రాముఖ్యం పెరుగుతోంది. ఏఐసీటీఈ ఇంటర్న్‌షిప్ పోర్టల్ వంటి వేదికల ద్వారా ఆన్‌లైన్ ఇంటర్న్‌షిప్‌లు లభ్యమవుతున్నాయి. ఇవి విద్యార్థులకు ప్రాక్టికల్ అనుభవాన్ని అందించడమే కాకుండా, కమ్యూనికేషన్, టీమ్‌వర్క్, టైం మేనేజ్‌మెంట్ వంటి ముఖ్యమైన నైపుణ్యాలను పెంచుతాయి.

## చిరునామా, రసీదు, తేదీ చూసుకోండి!

హైదరాబాద్: అసెంబుల్డ్ పరికరాల విక్రయాలతో వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు. తక్కువ ధర ఆశ చూపి నాసిరకం ఉత్పత్తులు విక్రయిస్తున్నారు. ఉత్పత్తులను కొనుగోలు చేశాక.. అవి కొన్ని రోజులకే మొరాయిస్తున్నాయి. జరిగే నష్టానికి పరిహారం ఎవరిస్తారు..? విక్రయ కేంద్రం నిర్వాహకుడా..? తయారీదారుడా..? డీలరా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

వినియోగదారుల పరిరక్షణ చట్టంలో వీటికి సంబంధించి స్పష్టమైన నిబంధనలున్నాయని న్యాయ నిపుణులు సూచిస్తున్నారు. 'తయారీదారు, డీలర్లు, రిటైలర్ల' వరకు అందర్నీ ప్రతివాదులుగా చేర్చి విచారించే వెసులుబాటు ఉంది. ఇందుకు వినియోగదారుడు కొనుగోలు చేసిన ప్రతిచోట 'చిరునామా, రసీదు, తేదీ' వివరాలు భద్రపరుచుకోవడం ద్వారా పరిహారం పొందొచ్చు.

**నాసిరకం ఉత్పత్తులతో ప్రమాదాలు..:** నాసిరకం పరికరాలతో ప్రాణాల మీదకొస్తున్న ఘటనలూ ఉన్నాయి. దోమల్‌గూడకు చెందిన దినేష్ షా అనే వ్యక్తి ఎంఎస్ ఎంటర్‌ప్రైజెస్‌లో ఇన్వర్టర్ కొనుగోలు చేశారు. మూడు రోజులకే బ్యాటరీ నుంచి పొగలు, మంటలు రావడంతో ఇళ్లంతా పొగతో నిండిపోయింది. మంటల దాటికి రూ.1,11,800 విలువైన సామగ్రి దగ్ధమైంది. ఇంట్లో ఎలాంటి షార్ట్‌సర్క్యూట్ జరగలేదని టీఎస్ఎస్పీడీసీఎల్, బ్యాటరీ ఇన్వర్టర్ వల్లే ఘటన జరిగిందని అగ్నిమాపకశాఖ రిపోర్టులిచ్చాయి. ప్రతివాద సంస్థ నుంచి పరిహారం



ఇప్పించాలని ఫిర్యాదీ కమిషన్‌ను ఆశ్రయించగా.. విచారించిన కమిషన్ 1,69,600 రూపాయలనుచెల్లించాలని ప్రతివాద సంస్థను ఆదేశించింది. జీడిమెట్లకు చెందిన ఓ వ్యక్తి రూ.3వేలతో అసెంబుల్డ్ కూలర్‌ను కొనుగోలు చేశారు. అది రెండో రోజు నుంచి మొరాయించడంతో షాపు యజమానిని సంప్రదించగా పట్టించుకోలేదు. దీంతో అతడు ఫిర్యాదు చేయగా.. కాళ్లబేరానికొచ్చి డబ్బులు తిరిగిచ్చేశాడు.

**రూ.కోట్లలో వ్యాపారం...**నగరంలో ఈ అసెంబుల్డ్ పరికరాల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. సికింద్రాబాద్, అబిడ్స్, కోఠి, పాతనగ రం తదితర ప్రాంతాల్లో అసెంబుల్డ్ పరికరాల విక్రయించే సముదా యాలు 10వేలకు పైగా ఉన్నాయి. లక్షలాది మంది కొనుగోలుదారులు ఉండగా.. ప్రతి నెలా రూ.50 కోట్లకు పైగా వ్యాపారం జరుగుతోంది. సాధారణ ప్రజలతో పాటు దిగువ మధ్య తరగతివారే ఎక్కువగా ఈ తరహా ఘటనల్లో బాధితులవుతున్నారు. వారంటీలు, గ్యారంటీలు, చిరునామా లేని బిల్లులను తీసుకొని చివరికి తలలు బాదుకుంటున్నారు.

# బొగ్గును మండిస్తూ.. కాలుష్యం పెంచేస్తూ



హైదరాబాద్: వాహన, నిర్మాణ రంగాల నుంచి వెలువడే కాలుష్యానికి తోడు బొగ్గు (చార్‌కోల్)ను మండిస్తుండటం ద్వారా వెలువడుతున్న కాలుష్యం నగరంలో క్రమంగా పెరుగుతోంది. ఫలితంగా సూక్ష్మధూళి రేణువులు, సల్ఫర్‌డయాక్సైడ్ పరిమాణం వాతావరణంలో పెరుగుతోంది. జూపార్కు ప్రాంతంలో ఇత్తడి, సిల్వర్ పాత్రల తయారీ దుకాణాలు ఎక్కువ సంఖ్యలో ఉండటంతో అక్కడ విపరీతమైన కాలుష్యం నమోదై వాయునాణ్యత తగ్గుతోంది. దీనికి తోడు నగరంలోని లాండ్రీ, ఇస్త్రీ, చిన్న జువెల్లరీ దుకాణాలు, మొక్కజొన్న విక్రయ కేంద్రాలు రెస్టారెంట్లు, హొటళ్లు, బార్బెక్యూ జాయింట్లలో గ్రిల్లింగ్ కోసం వినియోగం పెరుగుతోంది. నగర వ్యాప్తంగా ప్రతినెలా 600 టన్నుల బొగ్గులు వినియోగిస్తున్నట్టు అంచనా. అంటే ఏటా 7200 టన్నుల బొగ్గు వినియోగిస్తున్నారు. వీటికి ప్రత్యామ్నాయాలున్నా సరైన ప్రోత్సాహకాలు లేక, ఆర్థిక ఇబ్బందులతో వినియోగించడం లేదని చెబుతున్నారు.

**దుష్పరిణామాలెన్నో..**

బొగ్గును మండించడంతో అనేక దుష్పరిణామాలు సంభవిస్తున్నాయి. ఇవి పర్యావరణం, ఆరోగ్యం, ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయి. బొగ్గును మండించడంతో కార్బన్ డయాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్‌లు, బూడిద (పార్టిక్యులేట్ మ్యాటర్ – పీఎం 2.5, పీఎం 10)వంటివి విడుదలై గాలి నాణ్యతను దెబ్బతీస్తాయి. ఇవి గ్లోబల్ వార్మింగ్, ఆమ్లవర్షం, స్మోగ్ ఏర్పడటానికి కారణమవుతాయి. బొగ్గు దహనంతో విడుదలయ్యే కాలుష్య కారకాలు శ్వాసకోశ వ్యాధులు, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి సమస్యలకు దారి తీస్తాయి.

బొగ్గు దహనంతో విడుదలయ్యే కార్బన్‌డయాక్సైడ్ హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతల పెరుగుదలకు ఒక కారణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. బొగ్గు బూడిద, వ్యర్థాలు నీటి వనరులను కలుషితం చేస్తాయి.

మలక్‌పేట్, అంబర్‌పేట్, నాచారంలోని కొన్ని పరిశ్రమల్లో చార్‌కోల్‌ను ఇంధనంగా వినియోగిస్తున్నారు.

మాదాపూర్, హైటెక్‌సిటీ రెస్టారెంట్లలో చార్‌కోల్ గ్రిల్లింగ్‌తో స్థానికంగా పొగ, కాలుష్యం పెరుగుతోంది.

**సరఫరా ఇక్కడి నుంచే...**

చార్‌కోల్ అండ్ ఫైర్‌వుడ్ డిపోలు నగరంలో వందల్లో ఉన్నాయి. వీటి నుంచే బొగ్గు సరఫరా అవుతోంది. మలక్‌పేట్, నాచారం, అంబర్‌పేట్, కుషాయిగూడ, కుత్బుల్లాపూర్, మధురానగర్, షాపూర్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి సరఫరాదారులు ఎక్కువగా ఉన్నారు. కేజీరూ.50 చొప్పున బయట మార్కెట్‌లో విక్రయిస్తుండగా ప్రతినెలా రూ.4000తో బొగ్గు కొంటానని ఖైరతాబాద్‌కు చెందిన ఓ ఇస్త్రీదుకాణం నిర్వాహకురాలు తెలిపారు.

**పరిష్కార మార్గాలు..**

ఎల్పీజీ లేదా బయోగ్యాస్, ఎలక్ట్రిక్ గ్రిల్లింగ్ వంటి పరిశుభ్ర ఇంధనాలను ప్రోత్సహించడం ద్వారా ఖర్చు తగ్గించుకునే అవకాశం ఉంది.

రెస్టారెంట్లలో చార్‌కోల్ వాడకాన్ని నియంత్రించడానికి జీహెచ్ఎంసీ, పీసీబీ కఠిన నిబంధనలు అమలు చేయాలి.

చార్‌కోల్ ఉత్పత్తికి చెట్లను నరకడం ద్వారా పచ్చదనం తగ్గే ప్రమాదం ఉంది. బదులుగా మొక్కలు నాటితే ఉష్ణోగ్రతలను క్రమంగా తగ్గించే ఆస్కారం ఉంది.

## నకిలీపై.. బిగించాలి 'పీడీ'కిలి

ఖమ్మం : మొక్కజొన్న కంకి పోసుకోలేదని మొన్నటిదాకా రైతులు గగ్గోలు పెట్టారు. అంతకు క్రితం వరి పైరు ఈనే దశలో నోరెళ్లబెట్టిందని అన్నదాత రోడ్డెక్కాడు. పత్తి, మిరప దిగుబడి దారుణంగా తగ్గిందని సాగుదారులు తలలు పట్టుకున్నారు. సీజన్ ఏదైనా నకిలీ, నాణ్యతలేని విత్తు ఆర్థికంగా దిగజారుస్తోంది. కొద్దిరోజు ల్లో వానాకాలం సీజన్ ప్రారంభంకానుంది. వాణిజ్య పంటలు, వరి సాగుకు రాష్ట్రంలోనే ఉమ్మడి జిల్లా ప్రసిద్ధి. ఈసారి అత్యధికంగా పత్తి సుమారు 4 లక్షల ఎకరాల్లో సాగకానుందని వ్యవసాయ శాఖ అంచనా. ఆ తర్వాత మొక్కజొన్న, వరిదే స్థానం. ఆయా విత్తనాలకు ప్రస్తుతం డిమాండ్ అంతకంతకూ పెరిగింది. రైతులు విత్తన సేకరణలో నిమగ్నం కానున్నారు. వీరిని బురిడీ కొట్టించి నకిలీ విత్తులను అంటగట్టేందుకు ముఠాలు కాచుక్కూర్చున్నాయి. వీరికి టాస్క్‌ఫోర్స్ ముకుతాడు వేస్తేనే కృషీవలుర కష్టాలు గట్టెక్కుతాయి. లేదంటే అందరికీ అన్నం పెట్టేవారు నిలువునా మోసపోవడం ఖాయం.

**అక్రమాల పరంపర** ఈ ఏడాది టేకులపల్లి మండలంలో రూ.5,400 విలువైన, 9 కిలోల నకిలీ విత్తనాల్ని సీజ్‌చేశారు. మూడు ఘటనల్లో నలుగురిపై కేసులు నమోదయ్యాయి. ఉమ్మడిజిల్లాలో వేల ఎకరాల్లో విత్తన రకం మొక్కజొన్న విఫలమై పంట నష్టపోయారు. వరిదీ అదే తీరు. 2021లో చంద్రుగొండ, జూలురుపాడు, బూర్గంపాడు, పినపాక మండలాల్లో 7 కిలోల నకిలీ విత్తనాల్ని పట్టుకున్నారు. దళారులపై కేసులు పెట్టారు. అదే ఏడాది ఇల్లెందులో నకిలీ మొక్కజొన్న, టేకులపల్లి మండలం రాజారాంతండాలో నాణ్యతలేని పత్తి విత్తనాలు పట్టుబడ్డాయి.

**రైతులూ.. ఇవి పాటించండి**

కేంద్రం హెర్బిసైడ్ టాలరెంట్ పత్తి విత్తనాల్ని 2017లో నిషేధించింది. వీటిని ఎట్టి పరిస్థితుల్లో కొనొద్దు.

అధీకృత డీలర్లు (లైసెన్స్‌డ్) డీలర్ల నుంచే విత్తనాలు కొనాలి. ప్యాకింగ్‌ను సరిచూసుకోవాలి. ఏది కొన్నా రశీదు తప్పనిసరి, దాన్ని, ఖాళీ సంచుల్ని పంట దిగుబడి చేతికందే వరకు భద్రపరచుకోవాలి.

నిషేధిత, గడువు ముగిసిన రకాల్ని పసిగట్టాలి. ధర తక్కువని, లూజుగా విక్రయించే పత్తి, మిరప విత్తనాల్ని కొని మోసపోవద్దు.

అంగట్లో కూరగాయల్లా ఎక్కడ విత్తనాలు విక్రయానికి పెట్టినా విజిలెన్స్‌కు ఉప్పందించాలి.

రశీదులో రైతు పేరు, విత్తన కంపెనీ పేరు, చిరునామా, లాట్ నంబరు, సంచులు/ప్యాకెట్ల సంఖ్యను డీలర్లు తప్పక పొందుపర్చాలి.

డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లు కృత్రిమ కొరత సృష్టించకుండా నిల్వల రిజిస్టర్లను వ్యవసాయ శాఖ తనిఖీ చేయాలి.

లైసెన్స్‌లేని వారు జరిపే విక్రయాలపై చర్యలు తీసుకోవాలి.

వరి విత్తనోత్పత్తిపై రైతు ఉత్పత్తి సహకార కేంద్రాల ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు, అధికారులు అవగాహన పెంపొందించాలి.

విత్తన రకాలు సాగుచేస్తున్నట్లయితే, కంపెనీ ప్రతినిధులతో రైతులు బాండ్ పేపర్(ఒప్పందపత్రం)ను రాసుకోవాలి.

లైసెన్స్‌డ్ డీలర్ల వద్దే బ్రాండెడ్ విత్తనాల్ని కొనడం మేలు. రశీదుపై వారితో పాటు రైతూ సంతకం చేయాలి. వాటిని, ఖాళీ సంచులు, లేదా ప్యాకెట్లను పంట చేతికొచ్చే వరకు భద్రపరుకుంటే నష్ట నివారణ రాబట్టుకోగలం. విత్తనాలు మొలకెత్తకపోయినా, దిగుబడి రాకపోయినా విత్తన కంపెనీలు పరిహారమిస్తాయి. జిల్లాస్థాయిలో 2, మండలాల వారీగా ఏవోలు, పోలీసు అధికారులతో టాస్క్‌ఫోర్స్ బృందాలు తనిఖీలు చేపడతాయి. వి.బాబురావు, జిల్లా వ్యవసాయాధికారి, భద్రాద్రి కొత్తగూడెం2024–2025 పంట ఉత్పత్తి సంవత్సరంలో..

విత్తన శాంపిళ్లు ఖమ్మం : 406 భద్రాద్రి : 324 నమోదైన కేసులు ఖమ్మం : 20 భద్రాద్రి : 09

# ప్రాధాన్య ప్రాజెక్టులపై దృష్టి



జగిత్యాల : తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం చేకూర్చే ప్రాజెక్టులను ఈ వానాకాలం నుంచి అందుబాటులోకి తేవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు నీటి పారుదలశాఖ అధికారులు సిద్ధం చేసిన ప్రతిపాదనలు క్షేత్రస్థాయికి చేరితే పూర్తి ఆయకట్టు స్థిరీకరణ సాధ్యపడనుంది.

**75 చెక్‌డ్యాంలు ప్రశ్నార్థకం**

ఉమ్మడి జిల్లాలో రూ.315 కోట్లతో చేపట్టిన 75 చెక్‌డ్యాంల నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. కాకతీయ, వరద కాలువల నుంచి 601 గొలుసుకట్టు చెరువుల్లోకి తూములు, పైపులైన్లు, కాలువల నిర్మాణాన్ని పూర్తిచేయడం, గోదావరి నుంచి 34 గ్రామాలకు ఎత్తిపోతల పథకాల పూర్తికి నిధులు విడుదలైతే ఉమ్మడి జిల్లాలో ఆయకట్టు స్థిరీకరణ సాధ్యమవుతుంది.

**చివరిదశకు సదర్‌మాట్ పనులు**

జగిత్యాల, నిర్మల్ జిల్లాల మధ్య గోదావరిపై రూ.587 కోట్లతో చేపట్టిన సదర్‌మాట్ ప్రాజెక్టు నిర్మాణం దాదాపు పూర్తయింది. చివరిదఫా పనులకు రూ.13.64 కోట్ల నిధులను కేటాయించారు. ఇందులో 1.58 టీఎంసీల నీటిని నిల్వ చేయనుండగా.. 55 గేట్లు, 967 మీటర్లుగల ప్రాజెక్టు పరిధిలో రెండు జిల్లాల్లో 18 వేల ఆయకట్టు ఉంది. దీని ద్వారా జిల్లాలో 4,896 ఎకరాలకు నీరందనుంది.

**రోళ్లవాగు పూర్తికి ఎదురుచూపులు**

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఎత్తిపోసిన నీటితో.. పెద్దపల్లి జిల్లా దేవికొండవద్ద 7.78 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో పత్తిపాక జలాశయ నిర్మాణాన్ని తలపెట్టారు. జగిత్యాల జిల్లా బీర్‌పూర్‌లో రూ.165 కోట్లతో చేపట్టిన రోళ్లవాగు ఆధునికీకరణ చివరిదశకు చేరగా.. ప్రాజెక్టుకు గేట్లను అమర్చాల్సి ఉంది. ఇది పూర్తయితే దాదాపు 25 వేల ఎకరాలకు నీరందుతుంది. ఎస్సారెస్పీ మొదటిదశలో 0–146 కి.మీ ఎల్ఎండీ ఎగువ వరకు, 146–284 కి.మీ ఎల్ఎండీ దిగువనగల రెండో దశ ఆయకట్టులో తూములు, షట్టర్ల మరమ్మతులు, కాలువల లైనింగ్ తదితరాలకు రూ.660 కోట్ల నిధులు కేటాయించారు.

**ఎల్లంపల్లి జలాలను ఎత్తిపోసేలా..**

ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నంది, గాయత్రి పంపుహౌస్‌ల ద్వారా నీటిని ఎత్తిపోసి 1.54 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ లక్ష్యంగా ప్రభుత్వం నిర్ధేశించింది. ఎల్లంపల్లి జలాలను వరదకాలువ ద్వారా ఎస్సారెస్పీలోకి ఎత్తిపోసేలా రూ.1,950 కోట్లతో చేపట్టిన పునరుజ్జీవ పథకం పూర్తయింది. ఈ క్రమంలో మధ్య మానేరులో 27.500, దిగువ మానేరులో 22.034 టీఎంసీల నీటి నిల్వకు అవకాశం ఏర్పడింది. మల్యాలలో వరదకాలువ 88.400 కి.మీ వద్ద లింకు కాలువను తవ్వి 97.460 కి.మీ తాటిపల్లి వద్ద కాకతీయ కాలువలోకి నీటిని తరలించేలా రూ.36.82 కోట్లతో అనుసంధాన కాలువ నిర్మాణం పూర్తయింది. దీంతో ధర్మపురి, చొప్పదండి, రామగుండం, మంథని, పెద్దపల్లి, కరీంనగర్ నియోజకవర్గాల్లోని 2.51 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందనుంది.

## ఇల్లే.. ఓ జల నిధి

కొత్తగూడెం : ఇంటి ఆవరణలో పొంగిపొర్లే వర్షపు నీరు ఓవైపు.. చుక్క విదిల్చని కుళాయిలు ఇంకోవైపు. పట్టణాలు, నగరాల్లో ప్రతిఇంట్లో సాధారణంగా కనిపించే భిన్న పార్శ్వాలివి. ఒక్క సీజన్‌లో వర్షపు నీటిని ఒడిసిపడితే, ఏడాదంతా దాహార్తి కష్టాలు దరిచేరవు. పెద్దగా ఖర్చవని ఇంకుడు గుంతల నిర్మాణమే ఎద్దడికి సరైన పరిష్కారం. జలవనరుల శాఖ అధికారులు, పర్యావరణ వేత్తలూ ఇదే సూచిస్తున్నారు. వర్షాకాలం నేపథ్యంలోనైనా మేల్కోవాలి.

**తక్కువ ఖర్చు.. ఎంతో లాభం**

వేసవిలో వంద ప్లాట్లు ఉన్న అపార్ట్‌మెంట్‌లో నెలకు సుమారు 50 వేలు ట్యాంకర్లకే ఖర్చు చేస్తున్నారని అంచనా. తాగునీటి క్యాన్ల ఖర్చు అదనం. ఇంతకంటే తక్కువ ఖర్చుతో ఇంకుడుగుంత నిర్మించొచ్చు. వంద చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఇంటికి 6 క్యూబిక్ మీటర్ల విస్తీర్ణంలో గుంతను వాలుగా ఉన్న వైపున నిర్మిస్తే సరిపోతుంది.

**నిర్మాణం ఇలా..**

ఇంకుడు గుంతల్ని బోర్ల సమీపంలో ఏర్పాటు చేసుకోవడం మేలు. స్థలం పరిమాణాన్ని బట్టి అనువైన పొడవు, వెడల్పుతో 2 మీటర్ల లోతున గుంత తవ్వాలి. అడుగు నుంచి సగభాగం వరకు 40 మిల్లీమీటర్లు, తర్వాత పావు భాగం 20 మిల్లీమీటర్ల పరిమాణం గల కంకర నింపాలి. కొంతభాగం ఖాళీగా ఉండేలా చూసుకుని మిగతా దొడ్డు ఇసుకను నింపాలి. ఇంటి పైకప్పు, ఆవరణలోని వర్షపు నీటి ప్రవాహమంతా పైపులు, కాలువల్లో గుంతలోకి చేరేలా ఏర్పాట్లు చేసుకోవాలి.

**ఇదీ.. చినుకు విలువ**

ఒక ఇంటి పైకప్పు వైశాల్యం, కురిసిన వర్షపాతంపై ఇంకింపజేసే వర్షపు నీటి సామర్థ్యం ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు ఒక సంవత్సర సగటు వర్షపాతం 800 మి.మీ. నమోదై, 100 చదరపు మీటర్ల వైశాల్యం గల ఇంటి పైకప్పు ఉన్నట్లయితే.. 68 వేల లీటర్ల నీటిని ఒడిసిపట్టే అవకాశం ఉంటుందని జలవనరుల శాఖ అధికారులు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాలోని నగర, పురపాలికల్లో నివాసాల సంఖ్య.. 2,02,941. ఒక నివాసం సగటు పైకప్పు వైశాల్యం 180 చ.మీ. అనుకుంటే, ఏడాది సగటు వర్షపాతం 900 మి.మీ. కురుస్తుందని అంచనా వేస్తే.. సుమారు 30 వేల మిలియన్ లీటర్ల నీటిని భూగర్భంలోకి ఇంకింపజేయొచ్చు. ప్రస్తుతం అంచనా ప్రకారం ఖమ్మం నగరం, ఇతర పురపాలకాల ఏడాది తాగునీటి వినియోగం 29 వేల మిలియన్ లీటర్లుగా ఉంది. అంటే, నివాసాల్లోని పైకప్పు మీద కురిసే వర్షపునీరు, ఏడాదంతా పుర, నగరవాసులు వినియోగించే తాగునీటి కంటే ఎక్కువన్నమాట. "పట్టణాలు కాంక్రీటు కీకారణ్యాలుగా మారుతున్న నేపథ్యంలో భూగర్భజలాలు ఇంకడం లేదు. దీంతో వేసవి రాగానే ఎద్దడి తలెత్తుతోంది. ప్రత్యామ్నాయం ఇంకుడు గుంతలే. ప్రతిఇంటా నిర్మించుకుంటే, నీటి కొరత రాకుండా చూసుకోవచ్చు. గ్రామాల్లోని నివాసాలు, రహదారుల పక్కన విస్తృతంగా నిర్మాణాలు చేపడుతున్నాం. పట్టణాల్లోనూ చైతన్యం పెరగాలి'.

రమేశ్, భూగర్భ జలవనరుల శాఖ అధికారి, ఉమ్మడి ఖమ్మం

## మొక్కలు సిద్ధం.. నటడమే ఆలస్యం

గోదావరిఖని : వనమహోత్సవంలో భాగంగా సింగరేణి సంస్థ మొక్కలు నాటడానికి సిద్ధమయింది. ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తుండగా.. ఈ ఏడాది కూడా సింగరేణి వ్యాప్తంగా 45 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఆయా ప్రాంతాలను ఇప్పటికే గుర్తించింది. ఓబీ మట్టికుప్పలపై, బ్లాక్ ఫారెస్టు, అవెన్యూ ప్లాంటేషన్ పేరిట నాటేందుకు సమాయత్తమవుతోంది. సంస్థ ఇప్పటికే కోట్ల మొక్కలు నాటి సంరక్షిస్తోంది. సామూహిక అటవీ క్షేత్రాల మాదిరిగా మొక్కలను పెంచిన సింగరేణి ఈ ఏడాది 670 హెక్టార్లలో దాదాపు 45 లక్షల మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఒక్కో ప్రాంతానికి లక్ష్యాన్ని నిర్దేశించి నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా ఓబీ డంప్‌యార్డు(మట్టికుప్పలపై) ఎక్కువ శాతం నాటనున్నారు.

**11 ఏరియాల్లో వన మహోత్సవం**

సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లో వనమహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఒక్కో డివిజన్‌లో ఉన్న స్థలంతో పాటు మట్టికుప్పలను ఎంచుకుని వాటిపై మొక్కలు నాటనున్నారు. దీన్ని ఒక ప్రత్యేక కార్యక్రమంగా భావిస్తూ.. పర్యావరణ పరిరక్షణకు సింగరేణి తోడ్పాటు నందిస్తోంది. సాధ్యమైనంత మేర మొక్కలు నాటి వాతావరణ కాలుష్యం అరికట్టేందుకు ప్రయత్నిస్తోంది.

**ప్రభుత్వానికి, కార్మికులకు పంపిణీ**యాజమాన్యం ఇప్పటికే నర్సరీల్లో మొక్కలను సిద్ధంగా ఉంచింది. సింగరేణి వ్యాప్తంగా ఉన్న నర్సరీల్లో కోటి మొక్కల వరకు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వానికి అందించేందుకు కూడా సింగరేణి ఏడాది కాలంగా మొక్కలను పెంచుతోంది. నర్సరీల్లో అడవి జాతి, పండ్ల మొక్కలు పెంచారు. వేప, నారవేప, రావి, కానుగ, మామిడి, నిమ్మ, నేరేడు, జామ మొక్కలు పెంచుతున్నారు. రహదారుల పక్కన నాటడమే కాకుండా కార్మిక కుటుంబాలకు కూడా పంపిణీ చేయనున్నారు. ఏటా జూన్‌లో మొక్కలు నాటి సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నారు.

## మానేరు మట్టి.. యథేచ్ఛగా కొల్లగొట్టి

వేములవాడ : సహజ వనరులను రక్షించాల్సిన అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తుండటం, శాఖల మధ్య సమన్వయ లోపంతో మట్టి అక్రమ రవాణాకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. స్థిరాస్తి వ్యాపారులు, బడా కాంట్రాక్టర్లతో అక్రమార్కులు ఒప్పందం చేసుకొని భారీ యంత్రాలతో మట్టిని తోడుతూ టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. వేములవాడ గ్రామీణ మండలం అనుపురం, కొడిముంజ శివారులోని రాజరాజేశ్వర జలాశయం (మధ్యమానేరు)లో మట్టి దందా కొనసాగుతోంది. తవ్వకాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని.. శాఖల మధ్య సమన్వయ లోపం కనిపిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**నీరు తగ్గడంతో..**మధ్యమానేరు జలాశయం పూర్తి సామర్థ్యం 27.5 టీఎంసీలు కాగా జలాశయ నిర్మాణం అనంతరం 2019 నుంచి సుమారు 20 టీఎంసీలకుపైగా నీటిని నిల్వ చేస్తున్నారు. పూర్తి స్థాయిలో నీరు నిల్వ ఉన్న సమయంలో బ్యాక్ వాటర్ ముంపు గ్రామాల వరకు ఉంటుంది.

నీటినిల్వ తగ్గడంతో ముంపు గ్రామాలు, వ్యవసాయ భూములు తేలాయి. ఇదే అదనుగా అక్రమార్కులు మట్టి దందాకు తెరలేపారు. ఎఫ్‌టీఎల్ పరిధి దాటి జలాశయంలోకి చొరబడి యంత్రాలతో తవ్వకాలు చేపడుతున్నారు. పక్కా ప్రణాళికతో దందా నడిపిస్తూ రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు.

కొన్ని రోజులుగా ఈ దందా జోరుగా కొనసాగుతోంది. నిరంతరాయంగా ఓవర్ లోడ్‌తో మట్టి తరలిస్తున్నారు. యంత్రాలతో మట్టి తీయడంతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. కళ్లెదుటే పెద్దసంఖ్యలో వాహనాల్లో మట్టి అక్రమ రవాణా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**అధికారులు ఏమన్నారంటే..**

మధ్యమానేరు జలాశయ ఈఈ జగన్, వేములవాడ గ్రామీణ తహసీల్దార్ అబుబాకర్‌లను సంప్రదించింది. మట్టి తవ్వకాలకు తాము ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని వారు తెలిపారు. దందాపై తమకు సమాచారం లేదని.. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

# రైతులకు భరోసా

ఎల్లారెడ్డిపేట : వానాకాలం సీజన్ ప్రారంభంలోనే రైతు భరోసాను ప్రభుత్వం అమలు చేస్తుండటంతో అన్నదాతల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లా భౌగోళిక విస్తీర్ణం 4.82 లక్షల ఎకరాలు కాగా 2,82,490 ఎకరాల్లో పంటలను సాగు చేస్తున్నారు. 1,39,690 మంది రైతులు లబ్ధిపొందనుండగా రూ.153,28,81,264ల పెట్టుబడి సాయం అందనుంది. ఈ మేరకు జిల్లాలోని 175 రెవెన్యూ గ్రామాలకు చెందిన 1,10,424 మంది రైతులకు సోమ, మంగళవారాల్లో రూ.99,61,65,241లను సర్కారు జమ చేసింది. 1,39,690 మంది రైతులు.. రూ.153.28 కోట్లు

ప్రస్తుత వానాకాలం సీజన్ ప్రారంభంలోనే ప్రభుత్వం అందించే పంట పెట్టుబడి సాయం వ్యవసాయానికి ఊతంగా మారనుంది. జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 184860 ఎకరాల్లో వరి, 1600 ఎకరాల్లో మొక్కజొన్న, 49760 ఎకరాల్లో పత్తి, 14.04 ఎకరాల్లో జొన్న, 1155.1 ఎకరాల్లో కంది, 79 ఎకరాల్లో పెసర, 6304.96 ఎకరాల్లో ఇతర పంటలు కలుపుకొని మొత్తం 243773.1 ఎకరాల విస్తీర్ణంలో పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే రైతులు బోర్లు, బావుల కింద నార్లు పోసి, వరినాట్లకు సిద్ధమవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కొన్ని మండలాల్లో పత్తి విత్తనాలను కూడా విత్తారు. మరికొన్ని మండలాల్లో పత్తిని విత్తేందుకు భారీ వర్షాల కోసం నిరీక్షిస్తున్నారు. సమృద్ధిగా వర్షాలు కురిస్తే ఈ ఏడాది వానాకాలంలో భారీగా దిగుబడి సాధిస్తామనే ధీమాను అన్నదాతలు వ్యక్తం చేస్తున్నారు.



పంటల సాగులో భాగంగా విత్తనాలు, ఎరువుల కొనుగోలు, ఇతర వ్యవసాయ అవసరాలకు ప్రభుత్వం అందించే పంట పెట్టుబడి సాయం రైతులకు ఎంతగానో ఉపయోగపడనుంది. సమయానికి డబ్బులు అందుతుండడంతో ఇతరుల వద్ద చేయిచాచే అవసరం లేకుండా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. ఎకరాల విస్తీర్ణంతో సంబంధం లేకుండా పరిమితులను ప్రభుత్వం తొలగించడంతో ఈ ఏడాది జిల్లాలో ఎక్కువ సంఖ్యలోని రైతులకు మేలు చేకూరనుంది. అదునులోనే ఎకరానికి రూ. 6 వేల చొప్పున రైతు భరోసా పథకం అమలుతో జిల్లాలో పంటల సాగుబడి కూడా వడివడిగా కొనసాగనుంది.

# తాత్కాలిక మరమ్మతులు ఎన్నాళ్లు నిలిచేను..!

కోనరావుపేట: జిల్లావ్యాప్తంగా పలుచోట్ల కాజ్‌వేల నిర్వహణ అధ్వానంగా ఉంది. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో కనీస చర్యలు చేపట్టక పోవడంతో ఈసారికూడా ఇబ్బందులు తప్పేలా లేవని ప్రయాణికులు అంటున్నారు. జిల్లాలో వీర్నపల్లి, గంభీరావుపేట, కోనరావుపేట, రుద్రంగి, చందుర్తి మండలాల్లో అటవీ ప్రాంత గ్రామాలున్నాయి. ఈ మండలాల గుండా పొరుగునే ఉన్న జిల్లాలకు ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. పలుచోట్ల కాజ్‌వేలు, కల్వర్టుల నిర్వహణ అధ్వానంగా ఉండటంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రతిఏటా వర్షాకాలంలో వరద తీవ్రతకు కాజ్‌వేలు కోతకు గురై రాకపోకలు నిలిచిపోవటం పరిపాటిగా మారింది. వర్షాలు తగ్గుముఖం పట్టి రెండు మూడు మాసాలు గడిచిన తరువాత కాజ్‌వేలకు తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతున్నారు. ఇందుకోసం రూ.లక్షల వ్యయం అవుతుండగా సమస్య ఎప్పటిలాగే ఉంటోంది.

**ఏటా అదే సమస్య...**

కోనరావుపేట మండలం కొండాపూర్-వెంకట్రావుపేట గ్రామాల మధ్య పెంటి వాగు, నిజామాబాద్-మామిడిపల్లి, బావుసాయిపేట-



వెంకట్రావుపేట, వట్టిమల్ల-నిమ్మపల్లి గ్రామాల మధ్య మూలవాగుపై నిర్మించిన కాజ్‌వేలు గత మూడేళ్లుగా వర్షాకాలంలో కోతకు గురవుతున్నాయి. మూలవాగు పరీవాహక గ్రామాల రైతులు, వాహనదారులు మండల, జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగించటానికి సుమారు 20 కిలో మీటర్ల మేర చుట్టూ తిరిగి రావాల్సి వస్తోంది. దీంతో వ్యయ, ప్రయాసలకు గురవుతున్నారు. రైతులు వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లడానికి నానా అవస్థలు పడుతున్నారు. సరైన సమయంలో వ్యవసాయ పనులు చేసుకోవటానికి ఇబ్బందిగా మారుతోందని ప్రజలు వాపోతున్నారు. ఉదయం పొలం పనులకు వెళ్లిన రైతులు వర్షం కురిసి వాగు ప్రవహిస్తే ఇంటికి చేరుకోలేని పరిస్థితి నెలకొంటోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

**హైలెవల్ వంతెనలు నిర్మిస్తే మేలు**

సిరిసిల్ల జిల్లా కేంద్రం నుంచి కోనరావుపేట, మరిమడ్ల, సిరికొండ మీదుగా నిజామాబాద్ జిల్లా కేంద్రానికి రెండు వరుసల తారు రోడ్డు సౌకర్యం ఉంది. వర్షాకాలంలో పెంటివాగు వద్ద కాజ్‌వే మూడేళ్లుగా కోతకు రెండు, మూడు నెలలు రాకపోకలు నిలిచిపోతున్నాయి. నిజామాబాద్ జిల్లా కేంద్రానికి వెళ్లే వాహనదారులు కామారెడ్డి మీదుగా వెళ్లాల్సి రావటంతో సుమారు 50 కిలో మీటర్ల మేర వ్యయ, ప్రయాసలకు గురికావాల్సి వస్తోంది. హైలెవల్ వంతెనలు నిర్మిస్తే మేలు. పుల్కం ప్రశాంత్, వాహనదారుడు మరిమడ్ల

**నిధులు వృథా**

మూలవాగు, పెంటి వాగుపై నిర్మించిన కాజ్‌వేలు కోతకు గురవుతున్నాయి. కోతకు గురైన కాజ్‌వేలకు రూ.లక్షలు వెచ్చించి తాత్కాలిక మరమ్మతు చేపట్టినా నిధులు నీటి పాలవుతున్నాయి. కాజ్‌వేలపై అధిక లోడుతో భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో కూరుకుపోతున్నాయి. మరికొద్ది రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. శాశ్వత పరిష్కారం దిశగా అధికారులు చర్యలు చేపట్టాలి. ప్రజల ఇబ్బందులను పరిష్కరించాలి. గొల్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, బావుసాయిపేట

# కొనసాగుతున్నాయ్..!

ధర్మపురి : నూతన విద్యా సంవత్సరానికి మరో 17 రోజులే మిగిలి ఉంది. వేసవి సెలవుల తర్వాత పాఠశాలలు కొత్త రంగులు, హంగులతో స్వాగతం పలుకుతాయని భావిస్తున్న పల్లె విద్యార్థులకు ఈ సారి కూడా నిరాశ తప్పడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు కల్పించాలనే లక్ష్యంతో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో ప్రభుత్వం గతేడాది పనులు ప్రారంభించినా ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. దాదాపుగా 75 శాతం పూర్తయినట్లు అధికారులు చెబుతున్నా క్షేత్ర స్థాయిలో మాత్రం కనిపించడం లేదు. పనులు పూర్తయిన చోట సరికొత్తగా విద్యార్థులను ఆహ్వానించనుండగా, కొన్నిచోట్ల అసంపూర్తి పనులతో ఇబ్బందులు ఎదురవనున్నాయి. అధికారులు పూర్తి స్థాయిలో దృష్టి నిలిపి మిగిలిన పనులు పూర్తయ్యేలా చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

జిల్లాలో ఏప్రిల్, మే నెలల్లో 517 ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో పనులు ప్రారంభించారు. తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, విద్యుత్తు, భవన మరమ్మతు చేపట్టాలని నిర్ణయించారు. క్షేత్ర స్థాయిలో ఇంజినీరింగ్ అధికారులు సర్వే చేసి సూచించిన పనులు చేపట్టాలని భావించి ప్రభుత్వానికి నివేదించారు. ప్రత్యేక అవసరాల కింద పరిగణనలోకి తీసుకొని 2024 జూన్ నాటికే ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. పనులు 75 శాతం పూర్తయినట్లు, వీటిని ప్రారంభం చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. మిగిలిన పనులు ఎందుకు పూర్తి చేయడం లేదనే ప్రశ్న తలెత్తుతోంది.

సారంగాపూర్ మండలంలోని 21 పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్తు, తరగతి గదుల మరమ్మతు, మూత్రశాలల నిర్మాణాలకు ప్రతిపాదనలు తయారు చేశారు. మండలంలోని రంగపేటలో తాగునీటి వసతి పూర్తి కాగా, నాగునూర్‌లో పనులు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. బాలికల మూత్రశాలలు ఎక్కడా పూర్తి కాకపోవడంతో అవస్థలు తప్పేలా లేవు. పలు పాఠశాలల్లో వంట గదులు లేకపోవడంతో ఆరు బయటనే కొనసాగుతున్నాయి. పాఠశాలల పునఃప్రారంభానికి ముందే పనులు పూర్తి చేస్తేనే విద్యార్థులు, ఉపాధ్యాయులకు మౌలిక వసతులు సమకూరి ఇబ్బందులు తప్పనున్నాయి.

ఇది ధర్మపురి పట్టణంలోని ప్రాథమిక పాఠశాల. ఇక్కడ సుమారు రూ.లక్ష వ్యయంతో పాఠశాల పైకప్పు మరమ్మతు, ఇతర పనులు పూర్తి చేశారు. సంపు, మరుగుదొడ్ల నిర్మాణం ఇంకా పూర్తి చేయాల్సి ఉంది. దీనికి మరో రూ.లక్ష వరకు నిధులు అవసరం అవుతాయి. ఈ నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాల్సిన అవసరం ఉంది.

**ఆదర్శంగా తీర్చిదిద్దుతాం..**

ధర్మపురి మండలంలో మిగిలిన పనులను పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే దాదాపు 75 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులను జూన్ నెలారంభం వరకు పూర్తయ్యేలా చర్యలు చేపడతాం. పాఠశాలల్లో అన్ని రకాల వసతులు కల్పించి ఆదర్శంగా తీర్చిదిద్దుతాం. సీతాలక్ష్మి, ఎంఈవో ధర్మపురి

# చెరువు.. ఆక్రమణల దరువు



హైదరాబాద్ : శంషాబాద్‌లో రషీద్‌గూడ శ్యామచెరువు ఎఫ్‌టీఎల్‌లోని నిర్మాణాలివి. స్థానికులు ఆర్నెల్ల కిందట అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు స్పందించి పోలీసు కేసు నమోదు చేయించారు. నెలరోజుల తర్వాత తిరిగి నిర్మాణ పనులు మొదలుపెట్టడంతో అధికారులకు మళ్లీ ఫిర్యాదు చేశారు. కేసు పెట్టించాం.. హైడ్రా దృష్టికి తీసుకెళ్లామంటూ అధికారులు సమాధానమిచ్చి చేతులు దులుపుకొన్నారు. గాజులరామారం బంధం చెరువుకు సమీపంలోని ఇళ్లు, నిర్మాణాలివి. బఫర్‌జోన్‌లో ఇళ్లు కట్టుకుంటున్నారని స్థానికులు నాలుగైదేళ్ల క్రితం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను కోరారు. అధికారులు నిర్మాణదా రులను హెచ్చరించినా.. వారి పని కానిచ్చేసుకున్నారు తాజాగా బఫర్‌జోన్‌ను ఆనుకొని కొత్తగా నిర్మాణాలు చేపట్టారు. కొందరు అధికారులకు ఈ విషయం తెలిసినా పట్టించుకోవడం లేదు. నగర శివారులోని చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. శంషాబాద్, గాజులరామారం చెరువులతో పాటు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని 50 శాతానికిపైగా చెరువుల్లో ఇలాంటి నిర్మాణాలున్నాయి. నీటి వనరులను పరిరక్షించాల్సిన నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులు వాటివైపు చూడకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

**నిర్లక్ష్యం వల్లే..** చెరువుల ఎఫ్‌టీఎల్‌లు, బఫర్‌జోన్లలో ఇళ్లు, గోదాములు, ఫంక్షన్‌హాళ్లు ఏర్పాటయ్యాయంటే ప్రధానకారణం మున్సిపాలిటీలు, విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యమే. కళ్ల ముందే స్పష్టంగా కనిపిస్తున్నా.. మున్సిపల్ అధికారులు నిర్మాణాలకు అనుమతులిస్తున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు కనెక్షన్లు ఇస్తున్నారు. ఆయా నిర్మాణాల యజమానులు కోరినన్ని విద్యుత్ నియంత్రికలను ఏర్పాటు చేస్తున్నారు. నీటిపారుదల, రెవెన్యూ, మున్సిపాలిటీ, విద్యుత్‌శాఖ అధికారుల మధ్య సమన్వయలోపంతో ఇలాంటి అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, ఖాజాగూడ, నానక్‌రామ్‌గూడ, గండిపేట్, రాజేంద్రనగర్, శంషాబాద్, బాలాపూర్ మండలాల్లోని కొన్ని చెరువుల్లో అక్రమ నిర్మాణాలున్నాయి. సమీపంలోనే లే-అవుట్లు వెలుస్తున్నాయి. శంషాబాద్‌లోని చెరువుల్లో ఆక్రమణలపై నీటిపారుదలశాఖ ఏఈ మౌనికను వివరణ కోరగా.. బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

# మత్తు ఉచ్చు.. గుట్టురట్టు




హైదరాబాద్: "కుటుంబ బాధ్యతలు.. ఉద్యోగ లక్ష్యాల మధ్య ఒత్తిడికి గురై కాస్త రిలాక్స్ అవుదామని ఎప్పుడైనా డ్రగ్స్ తీసుకుంటాను. ఇంట్లో తెలియకుండా జాగ్రత్తగా ఉన్నా. బయటకు తెలిస్తే తలెత్తుకొని తిరగలేను. ఒక్కసారి క్షమించి వదిలేయండి సార్.." మాదకద్రవ్యాలకు అలవాటుపడిన ఓ ప్రజాప్రతినిధి బంధువు పోలీసుల కౌన్సెలింగ్‌లో చేసిన వేడుకోలు. ఇతనొక్కడే కాదు.. డ్రగ్స్ తీసుకుంటూ పోలీసులకు పట్టుబడిన వారి నోటి నుంచి వస్తున్న మాటలు ఇలాగే ఉంటున్నాయి. గుట్టు బయటపడదనే ధీమాతో స్నాప్‌చాట్, టెలిగ్రామ్ యాప్‌ల్లో లావాదేవీలు నిర్వహిస్తూ మత్తుపదార్థాలు కొంటున్న వారి జాతకాలను పోలీసులు బట్టబయలు చేస్తున్నారు. బుద్ధిమంతులమంటూ తప్పించుకునే ప్రయత్నంచేసినా, ఆధారాలు చూపడంతో తప్పుచేశామని అంగీకరిస్తున్నారు. అవకాశమిస్తే అలవాటు నుంచి బయటపడతామని ప్రాధేయపడుతున్నారని ఓ పోలీసు అధికారి తెలిపారు.

**ఎలా బయటపడుతున్నారంటే**

ఇటీవల టీజీన్యాబ్‌కు పట్టుబడిన డ్రగ్స్ కింగ్‌పిన్ మ్యాక్స్‌వెల్‌కు దేశవ్యాప్తంగా 2-3వేల మంది కస్టమర్స్ ఉన్నారు. వీరిలో సుమారు 400 మంది ఏపీ, తెలంగాణ వారేనని గుర్తించారు. హ్యాష్‌ఆయిల్ స్మగ్లర్ లక్ష్మీపతి పలుమార్లు అరెస్టయినా బుద్ధి మార్చుకోలేదు. ఇతడి వద్ద 50మంది కొకైన్, హెరాయిన్, ఓషన్‌గంజా కొనుగోలు చేస్తున్నట్టు తేల్చారు. గోవా, బెంగళూరు, ముంబయి కేంద్రంగా నైజీరియన్లతో సంబంధాలు పెంచుకొని డ్రగ్స్ దందా సాగిస్తున్నవారిపై పోలీసు యంత్రాంగం గురిపెట్టింది. ఈ ఏడాది 5 నెలల్లో 35మంది ప్రధాన నిందితులు అరెస్టయ్యారు. వారి సెల్‌ఫోన్లతో కొనుగోలుదారుల వివరాలు రాబడుతున్నారు. సామాజిక మాధ్యమాలద్వారా కోడ్‌భాషలో చేసిన చాటింగ్‌లు, నగదు లావాదేవీల ఆధారంతో వినియోగదారులను గుర్తించి పోలీస్‌స్టేషన్ల నుంచి నోటీసులు జారీ చేయిస్తున్నారు.

**అందరి నోట ఒకేమాట**

మత్తు పదార్థాలకు అలవాటుపడిన వారిలో అధికశాతం ఉన్నత విద్యావంతులే ఉంటున్నారు. ప్రతి 100 మందిలో 90 మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, వైద్యులు, ఇంజనీరింగ్ విద్యార్థులు ఉంటున్నారని ఒక పోలీసు అధికారి తెలిపారు. రూ.లక్షల్లో ప్యాకేజీ తీసుకుంటూ కంపెనీలో కీలకంగా వ్యవహరిస్తున్న ఉద్యోగులు ఉన్నారని ఒక ఇన్‌స్పెక్టర్ వివరించారు. మానసిక ఒత్తిడి నుంచి బయటపడేందుకు మత్తుకు అలవాటవుతున్నారు. కొందరు పార్టీలో సరదాగా తీసుకున్నామంటారు. ఇంకొందరు ఆర్థిక ఇబ్బందులు, కుటుంబసమస్యలు కారణంగా చెబుతున్నారు. బ్యాక్‌లాగ్స్ ఉన్నాయని, సరైన ప్లేస్‌మెంట్ సాధించలేకపోయామని విద్యార్థులు సమాధానమిస్తున్నారని నగరానికి చెందిన ఓ ఇన్‌స్పెక్టర్ వివరించారు. తొలుత కొనుగోలుదారులను నిందితులుగా చేర్చకుండా మానవతా కోణంలో వ్యవహరించేవారు. దీన్ని అనువుగా మార్చుకొని నైజీరియన్లతో లింకులు ఏర్పరుచుకొని దందా సాగించేంతగా తయారవుతున్నారని తెలిపారు. వీరి కదలికలపై సంబంధిత పోలీసులు నిఘా ఉంటుందని, ఏ మాత్రం అనుమానం వచ్చినా అదుపులోకి తీసుకుంటామని స్పష్టంచేశారు.

# ప్రణాళిక సరే.. పనులేవి?



వికారాబాద్ : పురపాలికల్లో వానాకాలం ప్రణాళికలు కార్యరూపం దాల్చడం లేదు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా పనులు చేస్తున్నామని సంబంధిత అధికారులు చెబుతున్నారు. వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు వణికిపోతున్నారు. వరద నీరంతా వీధుల్లో ప్రవహించడం, ఇళ్లలోకి చేరడంతో పేదలు ఏటా అవస్థలు పడుతున్నారు. ఇలాంటి సమస్యలు పరిష్కారానికి నోచడం లేదు. వికారాబాద్ పురపాలికల్లో పర్యవేక్షణ కరవైంది. కొందరు నాలాలు ఆక్రమించి నిర్మిస్తున్నారు. మురుగు కాల్వలు మూసుకుపోవడంతో వరద సాఫీగా పారడం లేదు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా పనులు తూతూ మంత్రంగా చేస్తున్నారని పట్టణ వాసులు వాపోతున్నారు. దోమల నివారణ పనులు మచ్చుకైనా కనిపించడం లేదు. పరిగిలో రెండు ఫాగింగ్ యంత్రాలున్నా విడతల వారీగా పనులు చేయడం లేదు.

**ప్రణాళికాబద్ధంగా పనులు..**

మురుగు కాల్వలు శుభ్రం చేయడం, పొదల తొలగింపు, ఇతర అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నాం. వార్డుల వారీగా ఫాగింగ్ చేసేలా చర్యలు తీసుకుంటాం. జాకీర్ అహ్మద్, వెంకటయ్య, కమిషనర్లు, వికారాబాద్, పరిగి

**దోమల నివారణకు చర్యలు కరవు**

వానాకాలం ప్రణాళిక రూపొందించినా చెప్పుకోదగ్గ తీరులో పనులు కావడం లేదు. 36 వార్డుల్లోని పక్కా కాలువల్లో మురుగు పారేలా పూడిక తొలగిస్తున్నారు. కచ్చా వాటిని పట్టించుకోవడం లేదు. దోమల నివారణకు సాయంత్రం వేళ ఫాగింగ్ చేయడం లేదు. కాలువలను ఆక్రమించిన నిర్మాణాలు తొలగిస్తున్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా పనులు మాత్రం పూర్తి స్థాయిలో కావడం లేదు.

**స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తున్నాం..**

పట్టణ ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహిస్తున్నాం. వానాకాలం ప్రణాళికలు రూపొందించి అమలు చేసే చర్యలు ప్రారంభించాం. వీధుల్లో వరద నిలవకుండా కాలువల్లో పేరుకున్న పూడిక తొలగిస్తున్నాం. - విక్రమ్‌సింహారెడ్డి, పుర కమిషనర్

**అవగాహన కరవు** పురపాలికలో వంద రోజుల ప్రణాళిక పనులు చేస్తున్నారు. పుర సిబ్బంది 1, 8, 12తోపాటు పలు వార్డుల్లో మురుగు కాలువలు శుభ్రం చేశారు. పిచ్చి మొక్కలు తొలగించారు. బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి పనులు నిర్వహిస్తున్నారు. ఇంకా పనులు చేయాల్సి ఉంది.

**అయిదు వార్డుల్లో పనులు కొనసాగుతున్నాయి..**

వంద రోజుల ప్రణాళికలో భాగంగా పనులు చేయిస్తున్నాం. తడి, పొడి చెత్తపై అవగాన కల్పిస్తున్నాం. అయిదు వార్డుల్లో పనులు కొనసాగుతున్నాయి. డెంగీ, మలేరియా సోకకుండా దోమల మందులు పిచికారీ చేయిస్తాం. బలరాంనాయక్, కమిషనర్.

# కోర్ బ్రాంచుల్లో చేరండి

హైదరాబాద్: ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష రాసి ర్యాంకులు సాధించిన విద్యార్థులు సివిల్.. మెకానికల్.. ఎలక్ట్రికల్ వంటి కోర్ బ్రాంచుల్లో చేరాలని జేఎన్‌టీయూ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈనెల 21న జేఎన్‌టీయూ ప్రాంగణంలో ఉన్నతవిద్యామండలితో కలిసి సంయుక్తంగా సదస్సును నిర్వహించనున్నారు. ఎప్‌సెట్‌లో ర్యాంకులు సాధించిన వారిలో 90శాతం మంది కంప్యూటర్‌సైన్స్‌లో చేరాలనుకోవడం, కన్వీనర్ కోటాలో సీటు రాకపోతే ప్రైవేటు కళాశాలలను ఎంపిక చేసుకోవడం వంటి పరిణామాల నేపథ్యంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సంప్రదాయ కోర్సులైన సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ బ్రాంచ్‌లకు డిమాండ్ ఎప్పుడూ ఉంటుందని వివరించనున్నారు. ఈ సదస్సుకు హాజరుకావాలనుకున్న విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ డాక్టర్ కేవీరావు తెలిపారు.

**తెలంగాణ రైజింగ్.. ఇంజినీరింగ్‌కు డిమాండ్**

తెలంగాణ రైజింగ్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, విదేశీ సంస్థలతో ఒప్పందాలు, పరిశ్రమల స్థాపన,




ప్రభుత్వ సమీకృత గురుకుల పాఠశాలల నిర్మాణం, విద్యుత్ లైన్ల ఏర్పాట్లు.. రహదారుల నిర్మాణం.. ఆటోమొబైల్, టెక్స్‌టైల్స్ పరిశ్రమలు వస్తున్నాయి. వీటిల్లో ఇంజినీరింగ్ నిపుణులు మాత్రమే అర్హులు. వచ్చే నాలుగేళ్లలో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో కనిష్ఠంగా 40వేల మంది ఇంజినీర్లకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

**మైనర్ డిగ్రీతో సాఫ్ట్‌వేర్ పరిజ్ఞానం**

సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ బ్రాంచులు చదివేవారు సైబర్‌భద్రత, మిషన్ లర్నింగ్‌లనూ నేర్చుకోవచ్చు. కంప్యూటర్ సైన్స్‌ను మైనర్ డిగ్రీగా అభ్యసించేందుకు అవకాశముంది. కోర్ బ్రాంచులకు ఆదరణ పెంచేందుకు జేఎన్‌టీయూ అధికారులు ప్రణాళికలను రూపొందిస్తున్నారు. ఇంటర్న్‌షిప్ అవకాశాలు ఇవ్వాలని కంపెనీల సీఈవోలతో చర్చిస్తున్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు కొత్త పరిణామాలను తెలుసుకునేందుకు అవగాహన సదస్సు ఉపయోగపడనుంది.

# ఈ బీమా.. ధీమా లేనిది

హైదరాబాద్: కారు, ద్విచక్రవాహనం బీమా పునరుద్ధరణ, జీవిత బీమా పాలసీ తీసుకోవడానికి ఆన్‌లైన్‌లో వెతుకుతుంటాం. ఇంతలోనే బీమా సంస్థ ప్రతినిధుల పేరుతో ఫోన్ కాల్.. సందేశం వచ్చిందా! ఇంటి నుంచి అడుగు బయట పెట్టకుండా ఒక్క క్లిక్కుతో అంతా ఆటోమేటిక్‌గా జరిగిపోతుందని చెప్పగానే నమ్మారా..? బహుమతులు, ఉద్యోగాలే కాదు.. బీమా బదలాయింపు, సాంకేతిక సమస్యలు, గడువు ముగిస్తే పునరుద్ధరిస్తామంటూ సైబర్ నేరగాళ్లు నిండా ముంచుతున్నారు. ప్రముఖ బీమా సంస్థల పేరుతో నకిలీ ఈ-మెయిళ్లు, సందేశాలు పంపి డబ్బు కొల్లగొడుతున్న ఘటనలు ఇటీవల పెరిగాయి. వాస్తవానికి బీమా వివరాలు, వాటి గడువు ఇతర సమాచారం ఇటు పాలసీదారుకు, బీమా సంస్థలకు మాత్రమే తెలుస్తాయి. సైబర్ నేరగాళ్లు ఈ సమాచారాన్ని డేటా ప్రొవైడర్లు, బ్రోకింగ్ కంపెనీల నుంచి సంపాదిస్తారు. వీటితో నేరగాళ్లు నేరుగా ఫోన్ చేసి కొత్త బీమాతో అధిక లాభాలు, పునరుద్ధరించుకోవాలని ఫోన్ చేస్తున్నారు. ఎక్కువ మంది వీటిని నమ్మి రూ.లక్షల్లో మోసపోతున్నారు.

**ఇవీ జాగ్రత్తలు..!**


బీమా పునరుద్ధరణ, బదలాయింపు పేరుతో వచ్చే ఈ-మెయిళ్లు, సందేశాలను నమ్మొద్దు. బీమా వివరాలను కొన్ని సంస్థలు పంచుకుంటాయి. లేదా డేటా భద్రపరిచే థర్డ్ పార్టీ ఏజెన్సీల ద్వారా ఇవి నేరగాళ్లకు చేరతాయి. ప్రస్తుతమున్న బీమా పాలసీల బదులు కొత్తది తీసుకుంటే మేలని చెప్పేవాటిని నమ్మొద్దు.

నేరుగా బీమా సంస్థ/ఏజెంటును సంప్రదించిన తరువాతే.. పాలసీల్లో మార్పులు ఇతర అవకాశాలను పరిశీలించాలి

**ఒకవేళ మోసపోతే** ఆలస్యం చేయకుండా 1930 టోల్‌ఫ్రీ లేదా స్థానిక పోలీసులను ఆశ్రయించాలి. ఒకవేళ వాట్సాప్, ఇతర సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రకటనలతో కూడిన సందేశాలు, లింకులు వస్తే రిపోర్టు చేయాలి.

# జలమండలికి విద్యుత్ ఛార్జీల భారం

హైదరాబాద్: మహానగరానికి తాగునీటిని సరఫరా చేసే జలమండలికి విద్యుత్ ఛార్జీల భారం తడిసి మోపెడవుతోంది. సంస్థకు వస్తున్న రాబడి వేతనాలు, నిర్వహణకే సరిపోతుండటంతో విద్యుత్ బకాయిల భారం భారీగా పెరుగుతోంది. ప్రతి నెలా రూ.120 కోట్లకు పైగా బిల్లు బకాయి పడుతోంది. జనవరి నాటికే రూ.5500 కోట్ల మేర బకాయిలు ఉన్నాయి. ఈ ఆర్నెల్లలో మరో రూ.700 కోట్లు తోడయ్యాయి. ప్రధానంగా కృష్ణా, గోదావరి నుంచి ఎత్తిపోతల ద్వారానే నీటిని తీసుకువస్తుండటంతో విద్యుత్ ఛార్జీల భారం ఎక్కువగా ఉంటోంది. నీటి శుద్ధి ప్లాంట్లు, ఎస్టీపీలు, పంపుహౌస్‌లు వివిధ రూపాల్లో



అదనంగా ఛార్జీల భారం పడుతోంది. ఈ భారాన్ని తగ్గించే అవకాశాలపై జలమండలి దృష్టి సారిస్తోంది.

ప్రణాళిక ఇలా..: జలమండలికి ఉన్న మొత్తం విద్యుత్ కనెక్షన్లపై పూర్తి స్పష్టత లేదు. వినియోగంలో లేని కనెక్షన్లు చాలా ఉన్నట్లు గుర్తించారు. వాటి తొలగింపుతో కొంత ప్రయోజనం ఉంటుందని భావిస్తోంది. తాజాగా 31మెగావాట్ల సామర్థ్యంతో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుపై దృష్టి సారించింది. నెలకు కనీసం రూ.10కోట్ల మేర విద్యుత్ ఛార్జీలు తగ్గించే లక్ష్యంలో వీటిని ఏర్పాటుచేయనుంది. ఇప్పటికే ప్రతిపాదనలను తెలంగాణ రెడ్కోకు అందజేసినట్లు జలమండలి ఉన్నతాధికారులు వివరించారు.

## నాడి పట్టేవారిలో.. నకిలీగాళ్లు

నల్గొండ : తెలంగాణ మెడికల్ కౌన్సిల్ బృందం తనిఖీలు చేసి వైద్యులపై పోలీస్ స్టేషన్లలో కేసులు మాత్రమే నమోదు చేయించింది. వాస్తవానికి ఈ అర్హతలేని వైద్యశాలను మూసివేయాల్సిన అధికారం జిల్లావైద్యారోగ్య శాఖకు ఉంది. డీఎంహెచ్‌వో కార్యాలయా నికి కూతవేటు దూరంలో ఉన్నా.. సదరు అధికారి ఈ నకిలీ వైద్యులు, వైద్యశాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కనీస విద్యార్హతలు లేకుండా వైద్యం చేస్తూ అమాయక ప్రజల ఆయువు తీస్తున్న నకిలీ డాక్టర్లపై కేసులు నమోదు కావడం జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇన్నాళ్లూ.. వైద్యారోగ్యశాఖలో ఉన్నతాధికారి నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు 'అందరికి తాయిలాలు' ఇచ్చి యథేచ్ఛగా క్లీనిక్‌లను నిర్వహిస్తున్న సదరు అక్రమ వైద్యులపై హైదరాబాద్‌లోని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ కొరడా ఝులిపించేవరకు జిల్లా వైద్యారోగ్యశాఖ మొద్దునిద్ర పోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా నల్గొండ జిల్లాలో వరసగా దాడులు చేస్తుండటంతో 'శంకర్‌దాదా ఎంబీబీఎస్'లు(వైద్యార్హత లేనివాళ్ల) గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయి.

జిల్లావ్యాప్తంగా గతంలో కంపౌండర్లుగా, నర్సులుగా పనిచేసిన అనుభవం, ఆర్ఎంపీలుగా దశాబ్దాలు పనిచేసిన వారు వైద్యుల వేషధారణలో ప్రజలను మోసం చేస్తున్నారు. నేషనల్ మెడికల్ మిషన్(ఎన్ఎంసీ), టీఎస్ఎంపీఆర్ చట్ట నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై తెలంగాణ వైద్యుల సంఘం నాయకులు డా. లాలయ్య కుమార్, ఛైర్మన్ డాక్టర్ కె.మహేశ్‌కుమార్‌ల బృందం తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేసింది. ఆ బృందం ఆధ్వర్యంలో ఇటీవల నల్గొండ, తిప్పర్తి, మునుగోడు ఠాణాల్లో 14 మందిపై కేసులు నమోదు చేశారు. వైద్యార్హత లేకుండా వీరు చేసిన అక్రమ వైద్యంపై గరిష్ఠంగా ఒక సంవత్సరం వరకు జైలుశిక్ష, రూ.5లక్షల జరిమానా కూడా విధించే అవకాశాలున్నాయి.



జ్వరం, జలుబు, ఒంటినొప్పులు, ఇతరత్రా ఆరోగ్య సమస్యలు వచ్చినా తమకు తాము వైద్యులమని చెబుతూ యథేచ్ఛగా యాంటీబయాటిక్, స్టెరాయిడ్స్, నొప్పి నివారణ సూదిమందులను ఎడాపెడా రోగులకు ఇస్తూ వారి ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నారు.

జిల్లా వైద్యారోగ్యంతో పాటు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ అనుమతులు పొందిన ప్రైవేటు ఆసుపత్రులు మొత్తం 672 ఉన్నాయి. ఇందులో 218 డయాగ్నోస్టిక్ సెంటర్లు, 197 ఆసుపత్రులు, 49 ప్రసూతి కేంద్రాలు, 30 కంటి, 20 చిన్నారులు, 8 ఈఎన్‌టీ, 64 దంత, 52 ప్రైవేట్ క్లీనిక్స్, 11 నర్సింగ్ హోమ్స్, 23 ఫిజియోథెరపీ క్లీనిక్‌లున్నాయి. అనధికారికంగా నల్గొండ పురపాలిక పరిధిలో ఉన్న 48 వార్డుల్లో పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా 6 నియోజకవర్గాల మండల కేంద్రాల్లోనూ ఇబ్బడిముబ్బడిగా నకిలీ వైద్యశాలలు వెలుస్తూనే ఉన్నాయి.

## ధనసిరి వరించె..

గరిడేపల్లి : ఉమ్మడి నల్గొండ జిల్లాలో ధాన్యం దిగుబడులు ఆశించిన కంటే అధికంగా వచ్చాయి. గతంతో పోల్చితే నూతన సాంకేతిక పద్ధతులు, హరితవిప్లవం మాదిరిగా అధిక దిగుబడినిచ్చే స్వల్పకాలిక వంగడాలు ఇందుకు కారణమయ్యాయి. తెలంగాణలో ఎక్కువ వరి పండించే జిల్లాల్లో నల్గొండ ప్రథమ స్థానంలో ఉంటుంది. నిజామాబాద్, కరీంనగర్, సిద్దిపేట తర్వాత సూర్యాపేట జిల్లా తర్వాతి స్థానంలో ఉంది. గతంలో సూర్యాపేట రెండో స్థానంలోనే ఉండేది. ఇప్పుడు సిద్దిపేట, నిజామాబాద్, కరీంనగర్ ఆ స్థానం ఆక్రమించాయి. సన్నాల సాగు సైతం భారీగా పెరిగింది. బోనస్ వస్తుందని రైతుల్లో నమ్మకం ఏర్పడటంతో దొడ్డు రకాలు సాగుచేసే రైతులు సైతం సన్నాల వైపు మొగ్గు చూపారు. గతంలోనూ నిజామాబాద్, కరీంనగర్ నుంచి సన్న ధాన్యం మిర్యాలగూడ మార్కెట్‌కు ఇబ్బడిముబ్బడిగా వచ్చేది. ప్రస్తుతం అది రెట్టింపు అయింది.



**వంగడాల ప్రభావం..**

ప్రధానంగా గత ఐదేళ్ల నుంచి నూతన సాంకేతిక పద్ధతులు, అధిక దిగుబడినిచ్చే ప్రైవేటు విత్తనాలు మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చాయి. పొలంలో సేంద్రియ సారం తగ్గిపోతుండటంతో రసాయన ఎరువుల వాడకం పెంచి అధిక దిగుబడి పొందడానికి రైతులు ప్రైవేటు కంపెనీలు అందించే విత్తనాల వాడకం పెంచారు. పుణె, చెన్నై, బెంగళూరు వంటి ప్రాంతాల నుంచి ప్రైవేటు కంపెనీలు సన్న రకాల విత్తనాలను ఉత్పత్తి చేస్తున్నాయి. ప్రయోగాలతో అధిక దిగుబడినిచ్చే రకాలను సంక్రమనం చేసి మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నాయి. దాంతో పాటు ప్రభుత్వ పరిశోధనా స్థానాల నుంచి సైతం సన్న రకాల విత్తనాలు కొత్తవి విడుదలవుతున్నాయి. జగిత్యాల వరి, వరంగల్ సన్నాలు, సిద్ధి, కంపసాగర్, కూనారం సన్నాలు, ఆర్ఎన్ఆర్‌లో పలు సన్నాలు, మార్టేరు తదితర పరిశోధనా స్థానాల నుంచి విడుదల చేశారు. వ్యవసాయ శాఖ ప్రకారం ఎకరాకు 23.5 క్వింటాళ్ల సాధారణ దిగుబడి అంచనా కాగా ఇప్పుడు ఎకరానికి 28-32 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

ప్రభుత్వం ఐకేపీలు, సహకార సంఘాల ద్వారా ఇప్పటి వరకు సన్న రకాల ధాన్యం కేవలం 30 శాతమే కొనుగోలు చేసింది. సూర్యాపేట జిల్లాలో 7,14,185 మెట్రిక్ టన్నుల సన్న రకాల దిగుబడి రాగా ఇప్పటి వరకు కేవలం 47,087 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. నల్గొండ జిల్లాలో 4,00,778 మెట్రిక్ టన్నుల సన్న రకాల ధాన్యం దిగుబడి అంచనా కాగా.. ఇప్పటి వరకు 17,729 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు.

## వన మహోత్సవానికి మొక్కలు సిద్ధం



ముస్తాబాద్: వనమహోత్సవానికి అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. వర్షాకాలం సమీపిస్తుండటంతో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే లక్ష్యాన్ని నిర్దేశించుకొని జిల్లాలోని ఆయా గ్రామాల్లోని నర్సరీల్లో మొక్కలు పెంచుతున్నారు. జూన్‌లో వర్షాలను బట్టి కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

జిల్లాలో 255 గ్రామపంచాయతీలు ఉన్నాయి. అన్ని గ్రామాల్లోని నర్సరీల్లో మొక్కలను పెంచుతున్నారు. 2025-26 సంవత్సరానికి జిల్లా వ్యాప్తంగా 6.77 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా ఎంచుకున్నారు. మండలానికో 60 వేలు, గ్రామానికి 3 వేలు, గ్రామావ సరాలను బట్టి మొక్కలను నాటేందుకు నర్సరీల్లో పెంపకం చేపట్టి సంరక్షిస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా, ఖాళీ స్థలాల్లో, పాఠశాల ఆవరణల్లో కులసంఘ భవనాల సముదాయాల్లో వేప, చింత, గుల్మోహర్, రావి, పథోడియా వంటి మొక్కలను నాటనున్నారు. ఇంటింటా దానిమ్మ, నిమ్మ, జామ, ఉసిరితోపాటు పూల మొక్కలను అందించనున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. 2014 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు జిల్లాలో రోడ్డుకు ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా మొక్కలు నాటారు. ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయ సముదాయాలు, సామాజిక భవనాల చెంత ఇప్పటి వరకు 2.50 లక్షల మొక్కలు నాటినట్లు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. ఇందులో 95 శాతం వరకు మొక్కలు బతికి ఉన్నాయని.. ఎండిపోయిన వాటి స్థానంలో కొత్తవి నాటి సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

**పచ్చదనం పెంపునకు కృషి**జిల్లాలో విరివిగా మొక్కలు నాటి పచ్చదనం పెంపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. వనమహోత్సవం కోసం ఇప్పటికే నర్సరీల్లో మొక్కలను సిద్ధంగా ఉంచాము. ఈసారి ఉద్యాన శాఖ ద్వారా మామిడి, నిమ్మ, మునగ, బత్తాయి, డ్రాగన్ ఫ్రూట్, తోటలు పెంచేందుకు చిన్న, సన్నకారు రైతులకు అవకాశం ఉంది. ఆసక్తిగల రైతులు జిల్లాలోని ఆయా గ్రామాల్లో తమ తమ గ్రామపంచాయతీ కార్యాలయాల, మండల పరిషత్ కార్యాలయాల ద్వారా ప్రతిపాదనలు సమర్పించి అనుమతి పొందాల్సి ఉంటుంది. చిన్న, సన్నకారు రైతులు సద్వినియోగం చేసుకోవాలి. -మాధవి, ఉపాధిహామీ జిల్లా ప్లాంటేషన్ అధికారి

## 'టీ' తోనే జీవితం



మిర్యాలగూడ : ప్రస్తుత రోజుల్లో అనేక మంది దినచర్య ప్రారంభమయ్యేది టీతోనే. ఉదయాన్నే కప్పు టీ తాగకపోతే ఆ రోజంతా వెలితిగానే ఉంటుంది అనేక మందికి. ఇంటికి వచ్చే అతిథులకు స్వాగతం చెప్పేది, పని ప్రదేశాల్లో మనసును కుదుటపరిచేది టీ. ఇంతగా మనుషుల జీవితాల్లో పెనవేసుకుపోయిన టీ శతాబ్దాల క్రితం నుంచే ఉన్నప్పటికీ ఉమ్మడి జిల్లాలో గత పదేళ్లుగా అనేక రకాలుగా రూపాంతరం చెందుతూ సరికొత్త రుచుల్లో లభ్యమవుతోంది.

**ఉమ్మడి జిల్లాలో ఇలా..**

టీ అనగానే తేయాకు మరిగించిన నీటిలో పాలు, పంచదార వేసి తాగడమే అనేక మందికి తెలుసు. కానీ గత కొన్నేళ్లుగా టీలో అనేక మార్పులు వచ్చాయి. నల్గొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, కోదాడ, భువనగిరి, చౌటుప్పల్, నార్కట్‌పల్లి వంటి ప్రాంతాల్లో పలు రకాల టీలు విక్రయించే దుకాణాలు మూడేళ్లలో సుమారు వెయ్యికి పైగా ఏర్పాటయ్యాయి. వీటిలో టీ టైమ్, టీ హౌస్ వంటివి వివిధ రకాల టీలతో అలరించాయి. అనంతరం బెల్లం చాయ్ రంగ ప్రవేశం చేసింది. ప్రస్తుతం ఎవరి నోట విన్నా బెల్లం టీ వినిపిస్తోంది. టికి తోడు గత ఏడాది కాలంలో వందకు పైగా కాఫీ షాప్‌లు వెలిశాయి. వీటిలో లభించే పలు రకాల టీలు ప్రజలను అలరిస్తున్నాయి.

**సరదాగా కాలక్షేపానికి..**

ఉమ్మడి జిల్లాలో వెలసిన టీ దుకాణలు, కాఫీ షాపులకు అనేక మంది స్నేహితులు, సహోద్యోగులు, బంధువులు, మహిళా సంఘాల సభ్యులు ఇలా అనేక మంది సాయంత్రం వేళలో కలిసి సరదాగా కాలక్షేపం చేసేందుకు వెళ్తుంటారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 37 లక్షలకు పైగా జనాభా ఉండగా.. వీరిలో సుమారు 14 లక్షల మందికి టీ తాగే అలవాటు ఉంది. వీరిలో 10 లక్షల మంది నిత్యం ఒక్క టీ అయినా తాగేవారుండగా.. సుమారు 2 లక్షల మంది గత రెండేళ్లుగా టీలో పంచదారకు బదులు బెల్లం వాడుతున్నారు. మరో రెండున్నర లక్షల మంది గ్రీన్ టీ, లెమన్ టీ తాగుతుండగా, లక్ష మంది వరకు బ్లాక్ టీ తాగుతున్నారు. జాగ్గరి అడ్డా అనే బెల్లం టీ దుకాణాలు ఉమ్మడి జిల్లాలో 35 ఉండగా ఒక్కో దుకాణంలో సరాసరి రోజుకు నాలుగు వందల మంది టీ తాగుతున్నారు.

**రకాలు ఇవీ..**

ప్రస్తుతం అనేక రకాల టీలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ముఖ్యమైనవి అల్లం, లెమన్, గ్రీన్, బెల్లం, బ్లాక్, బాదం, మసాల. కొందరు వ్యక్తులకు వీటిలో నిత్యం ఏదో ఒక టీ తాగడం అలవాటు. టీ తాగే వారిలో 95 శాతం 15 ఏళ్లు పై బడిన వారే ఉ ండగా..గ్రామాల్లో పదేళ్ల లోపు పిల్లలకు సైతం కొందరు టీ తాగిస్తున్నారు.

150 మి.లీ కప్పు టీలో 30 నుంచి 60 మి.గ్రా కెఫిన్ ఉంటుందని, అందుకే రోజుకు 300 మి.గ్రాములకు మించి కెఫిన్ తీసుకోకూడదని, అంటే రోజుకు 5కు మించి టీలు తాగితే అనర్థమేనని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మిగిలిన అన్ని టీల కంటే బ్లాక్ టీ, గ్రీన్ టీతో పలు ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని నిపుణులు సూచిస్తున్నారు.

## అడుగంటుతున్న జలం.. పొదుపే మంత్రం




నల్గొండ : ఎండలు మండుతున్నాయి. భానుడి ధాటికి భూగర్భ జలాలు భారీగా పడిపోతున్నాయి. వేసవిలో నీటి అవసరాలకు ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లాలో సగటు భూగర్భ జలమట్టం ఏప్రిల్‌లో 8.46 మీటర్లకు చేరింది. గత నెలతో పోల్చితే 0.33 మీటర్ల దిగువకు పడిపోయింది. వేసవి నీటి అవసరాలు ఎక్కువగా ఉండటంతో జలాలు అడుగంటుతున్నాయి. గతేడాదితో పోలిస్తే 2.87 మీటర్లపైనే జలం ఉన్నా... నీటి పొదుపు అవసరమని అధికారులు చెబుతున్నారు. అవసరానికి మించి నీటి వృథా చేయకుండా.. వినియోగంలో మెలకువలు పాటిస్తే.. భూగర్భ జలాలను రక్షించినవారిమి అవుతామని సూచిస్తున్నారు.

గతేడాది ఏప్రిల్‌లో 11.34 మీటర్ల లోతులో భూగర్భ జలం ఉండగా.. ఈసారి 8.46 లోతులో ఉంది. గతంతో పోలిస్తే భూగర్భ జలాలు కాస్త ఫర్వాలేదనిపించినా.. ఇష్టారీతిన తోడేస్తే అడుగంటే ప్రమాదముందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

సమృద్ధిగా వర్షాలు పడాలంటే జులై, ఆగస్టు వరకు ఆగాలి. ఈ నేపథ్యంలో పంటల సాగుకు బోరుబావుల కింద సాగుచేసే రైతులు వర్షాల కోసం ఎదురుచూడకుండా భూగర్భ జలాలను వినియోగించే అవకాశం ఉంది. ప్రజలు కూడా ఇతర అవసరాలకు బోర్ల వినియోగంపై ఆధారపడుతున్నారు.

**మండలాల పరిస్థితి**

భూగర్భ జలాల లభ్యత పరిశీలిస్తే నాంపల్లి, దామరచర్ల, చింతపల్లి మండలాల్లో అట్టడుగున భూగర్భ జలాలు ఉన్నాయి. నాంపల్లిలో 12.62, దామరచర్లలో 11.65, చింతపల్లిలో 10.86 మీటర్ల లోతులో జలాలు ఉన్నాయి.

**వాననీటిని సంరక్షించుకోవాలి**-కె.రేవతి డీడీ భూగర్భజలశాఖ నల్గొండ ఏప్రిల్‌లో భూగర్భజల మట్టం 8.46 మీ. నమోదు అయింది. మార్చిలో 8.13 మీ. ఉండగా.. 0.33 మీ. తగ్గింది. జిల్లా వాసులు ఇంకుడు గుంతలు నిర్మించి వాననీటిని సంరక్షిస్తే కొంత వరకు నీటి ఎద్దడిని ఎదుర్కోవచ్చు. రైతులు పొలాల్లో నీటి కుంటలను ఏర్పాటు చేసుకోవాలి.

## పెంచిన మెట్రో రైలు ఛార్జీల సవరణ

హైదరాబాద్: మెట్రో రైలు ఛార్జీలను సవరిస్తూ ఎల్ అండ్ టీ సంస్థ నిర్ణయం తీసుకుంది. ప్రయాణికులంతా ఛార్జీలను తగ్గిస్తారని భావించగా సంస్థ మాత్రం ఇటీవల పెంచిన ఛార్జీలపై 10శాతం రాయితీ ప్రకటించింది. ఈ నెల 24 నుంచి రాయితీలు మొత్తం మూడు కారిడార్లలో వర్తించనున్నట్లు ఎల్ అండ్ టీఎమ్ఆర్‌హెచ్‌ఎల్ సంస్థ ఎండీ, సీఈవో కేవీబీరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లోపించిన స్పష్టతమెట్రో రైలు ఛార్జీలు ఇటీవల కనీస ధర రూ.10 నుంచి రూ.12, గరిష్ఠ ధర రూ.60 నుంచి రూ.75కి పెంచింది. దీనిపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఎల్ అండ్ టీ సంస్థ పెరిగిన ఛార్జీలపై పునరాలోచన చేసి రాయితీ అంటూ ప్రకటించింది. తగ్గించిన డిస్కౌంట్ యథాతథంగా కొనసాగిస్తారా? ఎన్నిరోజుల వరకు అమలులో ఉంటుందనే విషయాలపై స్పష్టతనివ్వలేదు. పెంచిన ఛార్జీల వివరాల కోసం వెబ్‌సైట్‌ని సందర్శించాలని పేర్కొన్నా.. అందులో పెంచిన ధర వివరాల పట్టికే ప్రత్యక్షమవుతుంది. రాయితీ ప్రకారం చూసుకుంటే.. గరిష్ఠ ధర రూ.75లో 10శాతం అంటే రూ.67.5, కనిష్ఠ ధర రూ.12లో.. రూ.10.8 అవుతుంది. ఛార్జీలు తగ్గించకుండా రాయితీ ఇవ్వడంతో దీన్ని ఎప్పుడైనా ఎత్తేసే అవకాశం ఉంటుందనే చర్చ జరుగుతోంది.

## సిమెంటు లైనింగే శరణ్యం

తుంగతుర్తి : జిల్లాలో 2.5 లక్షల ఎకరాలకు సాగునీరందించాలనే ఆలోచనతో ఎస్సారెస్పీ కాలువల తవ్వకాలు జరిపారు. నిర్మాణం, నిర్వహణలో లోపాలే రైతుల పాలిట శాపాలుగా మారాయి. ప్రధానంగా కాలువలకు సిమెంటు లైనింగ్ చేస్తేనే చివరాయకట్టుకు నీరందుతుంది. ఇదే విషయమై తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అసెంబ్లీలో ప్రస్తావించారు.

ప్రధాన కాలువకు పడిన గండ్లు, లేచిపోయిన లైనింగ్‌కు పూర్తిగా మరమ్మతులు చేయాలి. ఆ కాలువకు అనుసంధానమైన 69, 71, 70-డీబీఎం కాలువలను పూర్తి స్థాయిలో తవ్వకం జరిపి వాటి మూడింటికీ చివరి ఆయకట్టు వరకు సిమెంటు లైనింగ్ చేయాలి. వాటితోపాటు వాటికి అనుసంధానంగా ఉన్న కుడి, ఎడమ ఉప కాలువలకు పడ్డ గండ్లు, కోతకు గురైన అక్విడెక్ట్‌లు, అపహరణకు గురైన తూములకు షెటర్లను ఏర్పాట్లు చేయాల్సి ఉంది. అన్ని కాలువల్లోనూ పెరిగిన కంపచెట్లను తొలగించాలి. నీటి ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా చేస్తేనే చివరి ఆయకట్టు రైతులకు నీరందనుంది.

**69 డీబీఎం:** ఈ కాలువ సామర్థ్యాన్ని పెంచాల్సి ఉంది. 600



క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తే వెళ్లేంత పరిమాణంలో కాలువను తవ్వలేదు. పూర్తిస్థాయిలో నీటిని వదిలితే డీబీఎం కాలువ పైనుంచి నీరు పొర్లి పోయే పరిస్థితిలో కాలువ ఉండటంతో అంత మేర నీటి విడుదల జరగటం లేదు. దీంతో నూతనకల్ మండలంలోని గ్రామాల రైతులకు సాగునీరు అందని ద్రాక్షగా మారింది. మండలంలో ఇది టెయిలెండ్ కాలువ కావటంతో మొదటి తూములు మొత్తం మూసివేస్తే తప్ప కిందికి నీరు చేరదు.

**లష్కర్లు లేక..:** కాలువలకు నీటిని విడుదల చేసినపుడు లష్కర్లు పర్యవేక్షించాలి. వారు లేకపోవటంతో రైతులు కాలువలకు ఇష్టం వచ్చినట్లు గండ్లు పెట్టుకొని నీటిని అక్రమంగా తరలించుపోతున్నారు. దీంతో రైతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి.

**ఇలాగైతేనే లబ్ధి:** ఖరీఫ్‌కు నీటి విడుదల చేసే సమయానికి ముందే కాలువ అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పనులు జరిపిస్తేనే రైతులకు సాగునీరు సక్రమంగా అందనుంది.

ంంత్రి సానుకూలంగా స్పందించారు- మందుల సామేల్, ఎమ్మెల్యే, తుంగతుర్తి జిల్లాలో శ్రీరాంసాగర్ రెండో దశ ద్వారా చివరి ఆయకట్టు వరకు ఉన్న ప్రతి రైతుకు సాగునీటిని అందించాలనేదే ప్రభుత్వం లక్ష్యం. ప్రస్తుత సమస్యల పరిష్కారానికి గాను ఇప్పటికే భారీ నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మాట్లాడి చేయాల్సిన పనుల గురించి వివరించా. ఆయన వెంటనే సానుకూలంగా స్పందించారు. సమస్యల పరిష్కారానికి చేయాల్సిన పనులు, కావాల్సిన నిధుల గురించి నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులకు సూచించారు.

## నిలోఫర్‌లో ప్రైవేటు దందా!

హైదరాబాద్ : నిలోఫర్ ప్రభుత్వ చిన్న పిల్లల ఆసుపత్రిలో ప్రైవేటు మెడికల్ మాఫియా రెచ్చిపోతోంది. ఏకంగా ఆసుపత్రి లోపల ప్రభుత్వ స్థలంలో మందుల దుకాణం కోసం శాశ్వత నిర్మాణాలు చేపడుతుండటం విస్తుగొలుపుతోంది. ముఖ్యంగా పిల్లలు ఆడుకునే పార్కును తవ్వేసి అక్కడ ప్రైవేటు మెడికల్ స్టోర్ ఏర్పాటు చేస్తుండటం విస్మయం కలిగిస్తోంది. ఈ వ్యవహారంపై నాంపల్లి శాసనసభ్యుడు మహ్మద్ మాజిద్ హుస్సేన్ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే పనులు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. గతంలో నిలోఫర్ ఆసుపత్రి పక్కనే ఒక ప్రైవేటు మెడికల్ స్టోర్ ఉండేది. అద్దె ప్రాతిపదికన



కొన్నాళ్ల కోసం అప్పట్లో కేటాయించారు. లీజు గడువు తీరిన తర్వాత నిర్వాహకులు అక్కడ నుంచి కదలకపోవడంతో వెంటనే ఖాళీ చేయాలని గతంలో నోటీసులు ఇచ్చారు. ఆ పని చేయకపోగా.. ఈ నోటీసులపై నిర్వాహకులు హైకోర్టును ఆశ్రయించారు. కొన్నేళ్లపాటు కోర్టులో ఈ కేసు నడిచింది. ఇటీవలే కేసు నిలోఫర్‌కు అనుకూలంగా వచ్చింది. వెంటనే అక్కడ నుంచి షాపు తొలగించాలని సూచించడంతో తీసివేశారు. మళ్లీ నెలల వ్యవధిలోనే ప్రస్తుతం అదే ప్రైవేటు మెడికల్ స్టోర్ ఏకంగా ఆసుపత్రి లోపల ఏర్పాటు చేస్తుండటం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్‌ను వివరణ కోరగా..కొన్నిసార్లు అర్ధరాత్రి మందుల కోసం తీవ్ర ఇబ్బందులు తలెత్తుతుంటాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రైవేటు సేవలు వినియోగించుకుంటామని, ఈ అంశం వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతస్థాయి దృష్టిలో కూడా ఉందని తెలిపారు.




## విశాఖలో యోగా డే.. 1200 కెమెరాలతో పర్యవేక్షిస్తున్నాం: హోంమంత్రి అనిత

విశాఖపట్నం : అంతర్జాతీయ యోగా దినోత్సవానికి విశాఖపట్నం సిద్ధమవుతోంది. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సాయంత్రమే విశాఖ చేరుకోనున్నారు. యోగాంధ్రను విజయవంతంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. యోగాంధ్ర నిర్వహణ ప్రాంతం మొత్తం సీసీకెమెరాల పర్యవేక్షణలో ఉన్నట్లు వెల్లడించారు. 1200 కెమెరాలు, డ్రోన్లతో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

## ప్రజాసేవ చేయకపోతే ప్రశాంతంగా పడుకోలేను: మోదీ



అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్న బిహార్‌లో తాజాగా మరోసారి పర్యటించిన మోదీ.. కాంగ్రెస్, ఆర్జేడీ కూటమిపై నిప్పులు చెరిగారు. బిహార్‌ను 'లైసెన్స్ రాజ్' సుదీర్ఘ కాలం పేదరికంలోనే ఉంచిందని, ఇందులో దళితులే అతిపెద్ద బాధితులుగా మారారని ఆరోపించారు. రాష్ట్రంలోని సివాన్‌లో అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఆయన.. ఎన్డీయే ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి దిశగా సాగుతుందన్నారు. "బిహార్‌ను ఎన్డీయే అభివృద్ధి చేస్తుందనడానికి మర్హౌరా రైలు ఫ్యాక్టరీ ఓ ఉదాహరణ. ఇప్పుడు ఆఫ్రికాలోనూ బిహార్‌కు ప్రశంసలు వస్తాయి. ఆర్జేడీ, కాంగ్రెస్‌లు పట్టించుకోని సరన్ జిల్లాలోనే ఈ రైల్వే ప్రాజెక్టు కొనసాగుతోంది.

తయారీ, ఎగుమ తుల్లో ఈ జిల్లా ఇప్పుడు ప్రపంచ పటంలో స్థానం సంపాదించుకుంది. బిహార్ అభివృద్ధిని సుదీర్ఘకాలంగా 'జంగిల్ రాజ్' అడ్డుకుంది. కానీ, ఇప్పుడు బిహార్‌లో తయారైన ఇంజిన్ ఆఫ్రికన్ రైలుకు శక్తినిస్తుంది" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్ అని మా ప్రభుత్వం చెబుతుంటే.. ఆర్జేడీ, కాంగ్రెస్‌లు మాత్రం 'పరివార్ కా సాత్' అంటూ వారి కుటుంబ శ్రేయస్సుకే ప్రాధాన్యం ఇస్తున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. దేశంలో పేదరికానికి కాంగ్రెస్ 'లైసెన్స్ రాజ్' కారణమన్నారు. నేతల కుటుంబీకులు ధనవంతులు కాగా.. సామాన్యులు మాత్రం పేదలుగానే మిగిలిపోయారన్నారు. రానున్న రోజుల్లో మూడు కోట్ల ఇళ్లు నిర్మిస్తామన్నారు. ప్రజాసేవ చేయకుంటే తాను ప్రశాంతంగా నిద్రపోలేనని.. రాత్రి-పగలు ప్రజల కోసమే పని చేస్తానని వ్యాఖ్యానించారు.



## గిరిజన విద్యార్థుల యోగా సాధన.. 108 నిమిషాలు.. 108 సూర్య నమస్కారాలు

విశాఖ: విశాఖపట్నంలో జూన్ 21న జరగనున్న యోగాంధ్ర-2025 కార్యక్రమానికి ముమ్మరంగా ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. విశాఖలోని ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో శనివారం 25వేల మంది గిరిజన విద్యార్థులతో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సాధనలో భాగంగా ఇవాళ ఏయూ మైదానంలో 25వేల మంది గిరిజన విద్యార్థులతో 108 నిమిషాల పాటు 108 సూర్య నమస్కారాలు చేయించారు. గిన్నిస్ రికార్డు సృష్టించేలా 108 నిమిషాల్లో 108 సూర్యనమస్కారాలు చేసిన 25వేల మంది విద్యార్థులను మంత్రి లోకేశ్ అభినందించారు.

## యోగాతో గిరిజన విద్యార్థులు చరిత్ర సృష్టించారు: మంత్రి లోకేశ్




విశాఖపట్నం: ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో యోగా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గిన్నిస్ రికార్డు సృష్టించేలా 108 నిమిషాల్లో 108 సూర్యనమస్కారాలు చేసిన 25వేల మంది గిరిజన విద్యార్థులను మంత్రి లోకేశ్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ఒక్క పిలుపుతో ప్రపంచం మొత్తం మనవైపు చూసే విధంగా చేసినందుకు అల్లూరి జిల్లా విద్యార్థులకు ప్రభుత్వం తరపున ధన్యవాదాలు. ఈరోజు మనందరం గర్వపడాల్సిన రోజు. యావత్ భారతదేశం కాదు.. ప్రపంచం మొత్తం విశాఖవైపు చూసిన రోజు. గతంలో ఎప్పుడూ లేని విధంగా గిరిజన బిడ్డలు చరిత్ర సృష్టించారు. 25వేల మంది విద్యార్థులు ఒకేసారి సూర్య నమస్కారాలు చేయడం గిన్నిస్ రికార్డుగా శనివారం ప్రకటిస్తారు. విద్యార్థులందరికీ ప్రధానమంత్రి మోదీ, సీఎం చంద్రబాబు తరఫున అభినందనలు. యోగా ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తారు.. ఈసారి విశాఖపట్నంలో నిర్వహించేందుకు అవకాశం ఇవ్వాలని ప్రధాని మోదీని కోరాం. రేపు 5 లక్షల మంది యోగాంధ్రలో పాల్గొని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సృష్టించబోతున్నాం.

యోగా అనేది కేవలం ఆసనాలు కాదు. మనందరికీ క్రమశిక్షణ నేర్పేది. నేను కూడా విద్యార్థి దశలో ఉన్నప్పుడు మా నాన్న నాతో యోగా చేయించేవారు. ఉదయాన్నే నిద్రలేపుతుంటే ఇబ్బంది పడేవాణ్ని. కానీ, ఆనాడు ఆయన నేర్పించిన క్రమశిక్షణ వల్లే ఈరోజు ఈ స్థాయికి వచ్చా. అదే క్రమశిక్షణ పట్టుదల మీ అందరిలో ఉంది. ఏ ఆశయాలతో ముందుకెళ్లాలనుకుంటున్నారో.. ఆవిధంగా ముందు కెళ్లండి. విజన్‌తో పనిచేయండి. మీరు ఏదైతే సాధించాలనుకున్నారో ఆశక్తి మీలో ఉంది. కలలు కనండి.. కష్టపడి పట్టుదలతో కృషి చేయండి" అని మంత్రి లోకేశ్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మంత్రులు సంధ్యారాణి, సత్యకుమార్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




అమరావతి: తన సతీమణి నారా భువనేశ్వరి కి సీఎం చంద్రబాబు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. "భువనేశ్వరి ప్రేమే మా కుటుంబానికి బలం, పునాది. ప్రతి ఒడిదొడుకులలో నా పక్కనే ఉన్నారు. ఆమె నా జీవితానికి వెలుగు. భువనేశ్వరి నా జీవిత భాగస్వామిగా ఉన్నందుకు కృతజ్ఞుడిని. వ్యాపారం, దాతృత్వం.. ఇలా అన్నింట్లో ఆమె నాయకత్వం మాకు స్ఫూర్తి"అని చంద్రబాబు పేర్కొన్నారు.




అమరావతి : ఏపీ ఎడ్‌సెట్ ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాలను మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్' వేదికగా విడుదల చేశారు. ఈ పరీక్షల్లో 99.42శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 17,795మంది రిజిస్టర్ చేసుకోగా.. 14,527మంది అర్హత సాధించినట్లు మంత్రి వెల్లడించారు. అభ్యర్థులు తమ రిజిస్ట్రేషన్ నంబర్, ఎడ్‌సెడ్ హాల్‌టికెట్‌తో పాటు పుట్టిన తేదీ వివరాలను ఎంటర్ చేసి ఫలితాలు, ర్యాంక్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఆచార్య నాగర్జున యూనివర్సిటీ ఆధ్వర్యంలో జూన్ 5న ఎడ్‌సెట్‌ను నిర్వహించి ఇటీవల ప్రాథమిక కీ విడుదల చేసిన అధికారులు..

తాజాగా ఫలితాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ ప్రవేశ పరీక్ష ద్వారా 2025-26 విద్యా సంవత్సరానికి బీఈడీ, బీఈడీ (స్పెషల్) కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్న విషయం తెలిసిందే.

## జగన్.. ఆ పరిస్థితి తెచ్చుకోవద్దు: ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఫైర్



అమరావతి: ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పుతో మాజీ సీఎం జగన్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని తెదేపా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించేలా విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తారా? అని నిలదీశారు. నీ బతుకే అబద్ధాల బతుకు.. ఖబడ్దార్ జగన్‌రెడ్డి అని ఆయన హెచ్చరించారు. అమరావతిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "పొట్టేలు తలలు నరికినట్లు ఎవరి తలలు నరుకుతావు? ప్రజలు ఇచ్చిన తీర్పుతో మతిభ్రమించి ప్యాలెస్‌లో టీవీలు పగలగొడుతూ ఇలా మాట్లాడతావా?రౌడీలు, గంజాయి బ్యాచ్‌ను వెనకేసుకొస్తావా? వైకాపా హయాంలో రాజారెడ్డి రాజ్యాంగంతో ప్రజలను హింసించావు. ఐదేళ్లూ నియంతలా పాలించావు. నేడు మళ్లీ అధికారం కోసం కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొడతారా? పల్నాడు జిల్లా పర్యటనలో ఇద్దరు మృతిచెందితే కనీసం పరామర్శకు కూడా వెళ్లలేదెందుకు?ఇకనైనా జగన్ కపట నాటకాలను కట్టిపెట్టాలి. అసలు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే హక్కు మీకుందా? అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఏం చేశారో దమ్ముంటే చర్చకు సిద్ధమా? యోగాంధ్రను పక్కదారి పట్టించేందుకు అలజడి సృష్టించేందుకు యత్నిస్తున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా సీఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నందునే జగన్ బయట తిరుగుతున్నారు శాంతిభద్రతలను చేతుల్లోకి తీసుకుంటామంటే కుదరదు. ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాల్సి వస్తుంది.. అప్పుడు బయట తిరగలేరు. ఆ పరిస్థితి తెచ్చుకోవద్దు " అని గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు.

## విశాఖకు కాగ్నిజెంట్.. రూ.1,582 కోట్లతో పెట్టుబడి




అమరావతి: విశాఖపట్నంలో ఐటీ క్యాంపస్ ఏర్పాటుకు కాగ్నిజెంట్ టెక్ సొల్యూషన్స్ ఆసక్తి కనబరిచింది. రూ. 1,582 కోట్లతో పెట్టుబడులు పెట్టనుంది. దీని ద్వారా 8 వేల మందికి ఉద్యోగాలు రానున్నాయి.

ఈ మేరకు విశాఖలో పెట్టుబడులు పెట్టేందుకు ఏపీ మంత్రి లోకేశ్ ఎదుట కాగ్నిజెంట్ సుముఖత వ్యక్తం చేసింది. ఈ సంస్థకు 99 పైసలకే ఎకరా భూమి కేటాయించేందుకు నిర్ణయించారు. ప్రపంచ స్థాయి ఐటీ క్యాంపస్ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నట్లు కాగ్నిజెంట్ వెల్లడించింది. కాపులుప్పాడ వద్ద 21.31 ఎకరాలు కేటాయించాలని కోరింది.




## కరుణాకర్‌రెడ్డి ఆరోపణలన్నీ అవాస్తవాలు, అభూత కల్పనలే: తితిదే

తిరుమల: వైకాపా నేత భూమన కరుణాకర్‌రెడ్డి చేసిన ఆరోపణలన్నీ అవాస్తవాలు, అభూత కల్పనలేనని తితిదే ఓ ప్రకటనలో తెలిపింది. ఆధ్యాత్మిక సంస్థపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదని, వ్యవస్థపై ఆరోపణలు చేసేముందు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని స్పష్టం చేసింది. "నిర్దిష్టమైన ఆధారాలు లేకుండా బురద జల్లడం శోచనీయం. శ్రీవారి ఆలయంలో తరతరాలుగా వస్తున్న వేద పారాయణానికి తూట్లు పొడిచే ప్రయత్నం జరుగుతోందని, వేద పారాయణదారులతో అవహేళనగా మాట్లాడటం అన్నది పూర్తిగా అవాస్తవం. ప్రస్తుతం శ్రీవారి ఆలయంలో వేద పారాయణాన్ని పఠించే సమయాన్ని గతంలో కంటే మరింత పెంచడంతో పాటు పూర్తిస్థాయిలో స్థిరీకరించాం. శ్రీవారి ఆలయంలో, వెలుపల, ఉభయ కాలిబాట మార్గాల్లో, కల్యాణ కట్ట, శ్రీవారి సేవ, బయట క్యూలైన్లు, వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రం తదితర ప్రాంతాల్లో ఏడాది కాలంగా ఓం నమో వేంకటేశాయ నామాన్ని అన్ని చోట్లా ప్రతిధ్వనించేలా ఏర్పాటు చేశాం. వేద పాఠశాలల్లో వేద విద్యార్థులకు శారీరక, మానసిక దృఢత్వం పెంచే విధంగా చర్యలు చేపడుతున్నాం

**అర్చకులను తనిఖీ చేయడమన్నది పూర్తిగా అవాస్తవం...** అర్చకులకు ఇచ్చే గౌరవంలో ఎలాంటి లోటుపాట్లు లేవు. వారికి ఇచ్చే గౌరవం ఎప్పుడూ ఉంటుంది. అయితే ఆలయం లోపల ఇటీవల అనేక సంస్కరణలు తీసుకురావడం జరిగింది. భక్తుల దర్శనాలు, తీర్థ ప్రసాదాలు, తదితర అంశాలపై అభిప్రాయ సేకరణ విధానాన్ని ప్రారంభించి పారదర్శకతకు పెద్దపీట వేశాం. ఈ విధానంపై భక్తుల నుంచి ప్రశంసలు అందుతున్నాయి.

**పలు పీఠాధిపతులకు నోటీసులు...** ఇది కూడా పూర్తిగా అవాస్తవం. గతంలో తితిదే కేటాయించిన స్థలానికన్నా ఎక్కువ స్థలం ఆక్రమించి నిర్మాణం చేపట్టినందుకు కోర్టు ఆదేశాల ప్రకారం విశాఖ శారదా పీఠం, మరో ఒకటి రెండు మఠాలకు నోటీసులు జారీ చేశాం. ప్రతి ఒక్కరూ చట్టాన్ని గౌరవించాలి. ఏడాది కాలంగా తితితే తీసుకొచ్చిన అనేక సంస్కరణలకు అన్ని మఠాలు తమ సహకారాన్ని అందిస్తున్నాయి. తితిదే కూడా పలు మఠాలకు నిబంధనల ప్రకారం మరమ్మతులు, ఆధునికీకరణ చేసుకునేందుకు అనుమతిచ్చింది.

**ఏఐ టెక్నాలజీ....** ఏఐ టెక్నాలజీతో దర్శనం చేయిస్తామని చెప్పి భక్తులను అడ్డుకుంటున్నారని అవాస్తవాలు పలికే ముందు నిజాలు తెలుసుకుని మాట్లాడితే బాగుంటుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా పరిస్థితులను ఎప్పటికప్పుడు విశ్లేషించి భక్తుల సౌకర్యార్థం శాస్త్రీయ పద్ధతిలో సమయ పాలన పాటిస్తూ, క్యూలైన్లను పకడ్బందీగా నిర్వహిస్తూ వస్తున్నాం.

బయట క్యూలైన్లలో వేచి ఉండే భక్తులకు 22 ఫుడ్ కౌంటర్లను అదనంగా ఏర్పాటు చేసి శ్రీవారి సేవకుల ద్వారా వారికి అన్న ప్రసాదాలు, పాలు, టీ, కాఫీ, మజ్జిగ, స్నాక్స్ విధిగా టైమ్ లైన్ ప్రకారం అందిస్తూ వస్తున్నాం. చరిత్రలో కనీవినీ ఎరుగని విధంగా అత్యధిక స్థాయిలో గురు, శుక్ర, శని, ఆది వారాల్లో భక్తులకు సౌకర్యవంతమైన దర్శనాలను అందిస్తున్నాం. తితిదే అందిస్తున్న వివిధ సౌకర్యాలపై మూడు విధాలుగా భక్తుల నుంచి ఎప్పటికప్పుడు అభిప్రాయ సేకరణ చేస్తున్నాం. ఐవీఆర్ఎస్, వాట్సాప్, శ్రీవారి సేవకుల ద్వారా సేకరిస్తున్న అభిప్రాయాల్లో 90 శాతానికి పైగా భక్తులు తితిదే అందిస్తున్న అన్న ప్రసాద, వసతి, తాగునీరు, లడ్డూ ప్రసాదం తదితర సేవలపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఏఐ ప్రాజెక్టు సాకారం కావడానికి తితిదే అన్ని చర్యలు తీసుకుంటోంది.

**పరకామణిలో తనిఖీ...** 2023లో పరకామణిలో జరిగిన ఘటన కారణంగా ఏర్పడిన అపవాదును తొలగించడానికి ఏడాది కాలంగా ఒక పకడ్బందీ వ్యవస్థను ప్రవేశ పెట్టాం.

ఈ వ్యవస్థపై కోల్పోయిన నమ్మకాన్ని పునఃస్థాపించేలా పరకామణిలో ఎస్‌వోపీ తయారు చేశాం. ఎవరైనా పరకామణిలోకి ప్రవేశించాలంటే ఈ ఎస్‌వోపీలో పేర్కొన్న విధంగా భద్రతా తనిఖీలు చేయడం జరుగుతుంది. ఇంతటి పకడ్బందీ వ్యవస్థ వల్ల ఏడాది కాలంగా పరకామణిలో ఎలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం" అని తితిదే ఓ ప్రకటనలో పేర్కొంది.

## సల్మాన్, అక్షయ్ ఫ్యాన్స్ మధ్య చిచ్చు పెట్టిన కాజోల్

బాలీవుడ్ క్రేజీ నటి కాజోల్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సల్మాన్‌ఖాన్, బాలీవుడ్ ఖిలాడీ అక్షయ్ కుమార్ ఫ్యాన్స్ మధ్య చిచ్చు పెడుతున్నాయి. రీసెంట్‌గా ఓ మీడియాతో మాట్లాడుతూ కాజోల్ బాలీవుడ్ కండల హీరో సల్మాన్ ఖాన్ స్టార్ డమ్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. తనది అద్వితీయమైన స్టార్ పవర్ అని, దాన్ని ఎవరూ టచ్ చేయలేరంది. సల్మాన్‌ను పొగిడే ప్రయత్నంలో కాజోల్ అక్షయ్ కుమార్‌ని తక్కువ చేసి మాట్లాడటం ఇప్పుడు రచ్చకు తెర లేపింది. అంతే కాకుండా తన స్టేట్మెంట్‌తో అక్షయ్ కుమార్ కూడా ఏకీభవిస్తాడని చెప్పి సల్మాన్ వర్సెస్ అక్షయ్ ఫ్యాన్స్ మధ్య మాటల యుద్ధానికి తెర తీసింది. కాజల్ చేసిన వ్యాఖ్యలపై అక్షయ్ కుమార్ అభిమానులు ఫైర్ అవుతున్నారు. సల్మాన్ ఖాన్ చరిష్మా, ఆయన స్టార్‌డమ్ ఎవరూ మ్యాచ్ చేయలేదే అయినా అక్షయ్ సాధించిన



విజయాలకు కూడా సమాన గౌరవం ఇవ్వాలని వారు కోరుకుంటున్నారు. సల్మాన్, అక్షయ్‌ల కెరీర్‌లో రూ.100 కోట్ల క్లబ్‌లో చేరిన సినిమాలు 18కి పైనే ఉన్నాయి. అక్షయ్‌కి భారీ ఫ్యాన్ బేస్ ఉంది. తనకు హీరోగా అత్యంత నమ్మకమైన స్టార్ అనే ట్యాగ్ ఉంది. అలాంటి హీరోని పట్టుకుని తన వ్యాఖ్యలతో అక్షయ్ కూడా ఏకీభవిస్తాడని కాజోల్ కించపరడం మాకు ఏమాత్రం నచ్చలేదని ఫ్యాన్స్ ఫైర్ అవుతున్నారు. అంతే కాకుండా వీరికి సమకాలీన హీరోగా మంచి ట్రాక్ రికార్డ్ ఉన్న తన భర్త అజయ్ దేవ్‌గన్‌ని కాజోల్ పూర్తిగా పక్కన పెట్టి సల్మాన్ ఖాన్ భజన చేయడం ఏమాత్రం బాగాలేదని కామెంట్‌లు చేస్తున్నారు. కాజోల్ చేసిన వ్యాఖ్యలని బట్టి ఇండస్ట్రీలో స్టార్ పవర్‌కే పెద్ద పీట వేస్తారన్నది మరో సారి రుజువైందని అంటున్నారు. సల్మాన్ ఖాన్‌కున్న స్టార్ డమ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. కానీ ఆయనని పొగిడే ప్రయత్నంలో ఇతర స్టార్లని తక్కువ చేసి చూపించడం మాత్రం తగదని, ఇలాంటి కామెంట్‌లు కాజోల్ మరోసారి రిపీట్ చేయకపోవడం మంచిదని బాలీవుడ్ సినీ అభిమానులు సెటైర్లు వేస్తున్నారు.

## కింగ్ నాగార్జున ఇదే ఫార్ములాను కంటిన్యూ చేస్తాడా?

టాలీవుడ్‌లో ఉన్న టాప్ సీరియర్ హీరోల్లో కింగ్ నాగార్జున ఒకరన్నది తెలిసిందే. అయితే చిరుతో పాటు బాలయ్య, విక్టరీ వెంకటేష్ హీరోలుగా సోలో హిట్‌లు సాధిస్తూ ఎంజాయ్ చేస్తుంటే కింగ్ నాగార్జున మాత్రం గత కొంత కాలంగా సరైన సక్సెస్‌ని దక్కించుకోలేక సతమతమవుతున్నారు. కెరీర్ పరంగా చాలా ఇబ్బందికరమైన ఫేజ్‌ని ఎదుర్కొంటున్నారు. గత ఏడాది మలయాళ రీమేక్ ఆధారంగా నాగ్ చేసిన మూవీ 'నా సామి రంగ'. 2024 సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ సినిమా నాగ్‌కు ఆశించిన విజయాన్ని అందించలేకపోయింది. కానీ ఈ ఏడాది సంక్రాంతికి 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో వచ్చిన వెంకీ మామ మాత్రం బ్లాక్ బస్టర్ హిట్‌ని సొంతం చేసుకుని వసూళ్ల పరంగానూ రికార్డులు సృష్టించాడు. నాగ్ మాత్రం ఆ రేంజ్ హిట్‌ని సొంతం చేసుకోలేక బాక్సాఫీస్ వద్ద విఫలమయ్యాడు. ఈ నేపథ్యంలోనే కింగ్ నాగార్జున కొత్త ఫార్ములాని ఫాలో కావాలని, హీరోగా, నటుడిగా కొనసాగాలంటే, అందరిలో ఉన్న క్రేజ్‌ని అలాగే మెయింటైన్ చేయాలంటే కొత్త పంథాని అనుసరించక



తప్పదనే నిర్ణయానికి వచ్చారట. ఇందులో భాగంగానే కథకు కీలకంగా నిలిచే పవర్ ఫుల్ నెగెటివ్ షేడ్స్ ఉన్న క్యారెక్టర్లకు ఓకే చెప్పాలనుకున్నారట. దాని ప్రకారమే హీరో రోల్స్ అప్పుడప్పుడు చేస్తూ పవర్ ఫుల్ క్యారెక్టర్లకు ప్రాధాన్యత నివ్వాలని డిసైడ్ అయ్యారట. తన కొత్త ఫార్ములా ప్రకారమే ధనుష్ నటించిన 'కుబేర', సూపర్ స్టార్ రజనీకాంత్‌తో లోకేష్ కనగరాజ్ తెరకెక్కిస్తున్న 'కూలీ' సినిమాల్లో విలన్ షేడ్స్ ఉన్న పాత్రల్లో నటించారని తెలుస్తోంది. రజనీ 'కూలీ'లో నాగ్ పవర్ ఫుల్ విలన్‌గా సిమోన్ అనే క్యారెక్టర్‌లో కనిపించబోతున్నాడు. ఈ క్యారెక్టర్ చాలా పవర్ ఫుల్‌గా ఉంటుందని, రజనీతో ఢీ అంటే ఢీ అనే స్థాయిలో ఉంటుందని అంటున్నారు. ఆ కారణంగానే నాగ్ ఈ క్యారెక్టర్ చేశాడట. ఇప్పటికే బాలీవుడ్ మూవీ 'బ్రహ్మాస్త్ర'లో పవర్ ఫుల్‌గా సాగే నంది అస్త్ర క్యారెక్టర్‌లో నటించిన నాగ్ ఇకపై ఇదే ఫార్ములాని కొనసాగిస్తూ తెలుగు, తమిళ, హిందీ భాషల్లో రూపొందే సినిమాల్లో పవర్ ఫుల్ క్యారెక్టర్లు చేస్తారట. అయితే ఇక డైరెక్టర్లు చాలా వరకు నాగ్ కోసం కొత్త తరహా క్యారెక్టర్లని సృష్టించడం ఖాయం.




## కీర్తి సురేష్ ఉప్పు కప్పురంబు ట్రైలర్ టాక్..!



తెర మీద చూసే సినిమా కథలు కొన్నైతే ఓటీటీల కోసమే తెరకెక్కించే కథలు మరికొన్ని ఉంటాయి. ప్రస్తుతం ప్రేక్షకుడు థియేటర్‌కి వెళ్లి సినిమా చూసేందుకు అంతగా ఆసక్తి చూపించట్లేదు. ఓటీటీ సంస్థలు కూడా సినిమాలకు ధీటుగా ఒరిజినల్ కంటెంట్ తో వస్తున్నారు. వారిలో ప్రైమ్ వీడియో ప్రేక్షకులను అలరించే సినిమాలతో వెరైటీ కథలతో వస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రైమ్ వీడియోలో వస్తున్న మరో సినిమా ఉప్పుకప్పురంబు. సుహాస్, కీర్తి సురేష్ లీడ్ రోల్ లో నటిస్తున్న ఈ సినిమాను ఎల్లనార్ ఫిల్మ్స్ ప్రై లిమిటెడ్ బ్యానర్ పై రాధిక లావు నిర్మించగా సినిమాను అని.ఐ.వి.శశి దర్శకత్వం వహించారు. ఇంతకీ ఈ సినిమా కథ ఏంటంటే ఒక పల్లెటూరిలో స్మశానంలో చోటు తక్కువ కావడంతో అందులో స్థానం కోసం ఆ ఊరి జనమంతా పోటీపడుతుంటారు. కథ కాస్త విచిత్రంగానే ఉండగా ఆద్యంతం ప్రేక్షకులను నవ్వించేలా ఎంటర్టైన్మెంట్ తో రాబోతుంది. ఈ సినిమాలో బాబు మోహన్, శత్రుతో పాటుగా తాళ్లూరి రామేశ్వరి కూడా ఇతర కీలక పాత్రల్లో నటించారు. ప్రైం వీడియో ఈ సినిమాను 240 దేశాల్లో జూలై 4న రిలీజ్ చేస్తున్నారు. తెలుగుతో పాటుగా తమిళ్, మళయాళం, కన్నడ, హిందీ, ఇంగ్లీష్ ఇలా 12 భాషలతో పాటుగా మరో 12 భాషల్లో సబ్ టైటిల్స్ తో రిలీజ్ చేస్తున్నారు. ఈ సినిమాలో కీర్తి సురేష్ లుక్ బాగుంది.. ఆమె ఇందులో గ్రామాధికారి అపూర్వ పాత్రలో కనిపించనున్నారు. సుహాస్ కూడా తన పాత్రలో మెప్పించేలా ఉన్నాడు. విలేజ్ బ్యాక్ డ్రాప్ లో తెరకెక్కిన ఉప్పు కప్పురంబు సినిమా ట్రైలర్ కామెడీ, ఎమోషన్స్ రోలర్ కోస్టర్ రైడ్ లా ఉంది. ఐతే ట్రైలర్ కాస్త గజిబిజిగా అనిపించినా సినిమా మాత్రం ఆడియన్స్ ని అలరిస్తుందని అంటున్నారు. వెరైటీ కథలు సినిమాలు ఎక్కడ వచ్చినా ఆదరించే ఆడియన్స్ ప్రైమ్ వీడియో నుంచి వస్తున్న ఈ ఉప్పు కప్పురంబు సినిమాను ఏమేరకు ఆదరిస్తారన్నది చూడాలి. ప్రైమ్ వీడియోలో వచ్చే ఒరిజినల్ కంటెంట్ సినిమాలకు విపరీతమైన ఫ్యాన్స్ ఉంటారు. మిగతా వాటిలానే ఉప్పు కప్పురంబు సినిమా కూడా అదే రేంజ్ రెస్పాన్స్ తెచ్చుకునే ఛాన్స్. కీర్తి సురేష్ నుంచి ఆఫ్టర్ షార్ట్ గ్యాప్ వస్తున్న సినిమా కాబట్టి ఆమె ఫ్యాన్స్ కి ఐతే ఈ సినిమా మంచి ట్రీట్ ఇస్తుందని చెప్పొచ్చు.

## అనగనగనగ కథ: చంద్రబోస్ నుంచి పవర్‌ఫుల్ సాహిత్యం




నాటు నాటు ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందడం వెనక, భారతదేశానికి ఆస్కార్ ని అందించడం వెనక ఎం.ఎం.కీరవాణితో కలిసి పని చేసిన బృందంలో కీలక వ్యక్తి, ఆ పాటను రాసిన సీనియర్ లిరిసిస్ట్ చంద్రబోస్. ఆయన సాహిత్యంలో పదజాలం సార్వజనీనతతో మ్యాజిక్ చేస్తుంది గనుకే ఈ రోజు అంతటి గుర్తింపు. నాటు నాటు కోసం బోస్ ఎంపిక చేసుకున్న తెలుగు పదాలను తెల్లోళ్లు కూడా అవలీలగా పాడుకున్నారు. అది ఆయన ఘనత. దశాబ్దాలుగా పాటల రచనలో ఆయన అనుభవం సమున్నతమైనది. ఇప్పుడు అదే అనభవంతో ఆయన రాసిన ఓ పాట ప్రజల హృదయాలను గెలుచుకుంటోంది.

అది కుబేర కోసం అనగనగ కథ.. అందరికీ తెలిసిన కథ...సాంగ్. డబ్బు కేంద్రంగా సాగే ఈ పొలిటికల్ డ్రామా థీమ్ ని ఈ పాట ఎలివేట్ చేస్తోంది. చంద్రబోస్ చాలా పవర్‌ఫుల్ పదజాలాన్ని ఉపయోగించి పాటను అద్భుతంగా రాసారు. ఎదిగేవాడిని తొక్కేవాడి కథ, పేదలు బలహీనుల కథ, అంతం లేని అరాచకుల కథ ఎలా ఉంటుందో ఆయన వర్ణించిన తీరు ఉత్కంఠను పెంచుతోంది. రాక్ స్టార్ దేవీశ్రీ ప్రసాద్ సంగీతం, బోస్ సాహిత్యం కార్తీ, కరీముల్లా ఎనర్జిటిక్ గానం కూడా పెద్ద ప్లస్. కమ్ముల నిజ జీవితం సంఘటనల ఆధారంగా కొన్ని సన్నివేశాల్ని ఇందులో చూపిస్తున్నారన్న గుసగుస ఉంది. ఈ సీజన్ లో మోస్ట్ అవైటెడ్ చిత్రంగా రానున్న కుబేరకు సాహిత్యం, సంగీతం ప్రధాన అస్సెట్ కానున్నాయి.

ఈ పాన్-ఇండియన్ చిత్రంలో ధనుష్ ప్రధాన పాత్రను పోషిస్తుండగా, నాగార్జున అక్కినేని, రష్మిక ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. శేఖర్ కమ్ముల దర్శకుడు. ఈ చిత్రం సెన్సార్ ఫార్మాలిటీలను పూర్తి చేసుకుంది. 181 నిమిషాలు - అంటే మూడు గంటల ఒక నిమిషం నిడివితో యుఎ సర్టిఫికేట్ పొందింది. ప్రమోషనల్ మెటీరియల్ ఇప్పటికే ప్రేక్షకులలో ఆసక్తిని రేకెత్తించింది. బుకింగ్‌లు బావున్నాయన్న టాక్ ఉంది. సునీల్ నారంగ్ - పుస్కుర్ రామ్ మోహన్ రావు ఈ చిత్రాన్ని నిర్మించారు.

## నయన్ లో కొత్త ఉత్సాహం.. టాలీవుడ్ నచ్చేసిందా..?

కోలీవుడ్ స్టార్ హీరోయిన్ నయనతార ఆఫ్టర్ గ్యాప్ మళ్లీ తెలుగు సినిమాలో నటిస్తుంది. మెగాస్టార్ చిరంజీవి అనిల్ రావిపూడి కాంబినేషన్ సినిమాలో నయనతార ఫిమేల్ లీడ్ గా ఫిక్స్ అయ్యింది. ఆల్రెడీ ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. టాలీవుడ్ స్టార్స్ తో ఆల్రెడీ నయన్ నటించింది. 2019 లో చిరుతో సైరా నరసింహా రెడ్డి చేసింది. ఆ తర్వాత గోపీచంద్ తో ఆరడుగుల బుల్లెట్ లో నటించింది. ఇక కోలీవుడ్ లోనే వరుస సినిమాలు చేస్తుండటం వల్ల అమ్మడు తెలుగులో చేసే వీలు కుదరలేదు. మధ్యలో ఒకటి రెండు ఆఫర్లు వచ్చినా కాదనేసింది. ఐతే చిరంజీవి ఆఫర్ రాగానే రీ ఎంట్రీకి ఇదే కరెక్ట్ టైం అనుకుని మళ్లీ తెలుగు సినిమాను సైన్ చేసింది నయనతార. అదీగాక ఈమధ్య టాలీవుడ్ సినిమాలు పాన్ ఇండియా లెవెల్ లో చేస్తున్న అద్భుతాలు తెలిసిందే. అందుకే నయనతార ఈసారి ఒక పాజిటివ్ సైన్ తోనే టాలీవుడ్



వచ్చింది. అంతేకాదు ఇక్కడ యూనిట్ రిసీవింగ్.. ఫ్యాన్స్ హంగామా అంతా కూడా ఆమెలో కొత్త ఉత్సాహాన్ని తెచ్చిందని తెలుస్తుంది. చిన్న గ్యాప్ తర్వాత టాలీవుడ్ వచ్చిన నయనతారకి ఇక్కడ ఫ్యాన్స్ నుంచి గ్రాండ్ వెల్కం దొరికింది. అంతేకాదు సినిమాలోకి ఆన్ బోర్డ్ అవుతూనే చేసిన స్పెషల్ వీడియో కూడా సూపర్ హిట్ అయ్యింది. అక్కడ ఉంది అనిల్ రావిపూడి కాబట్టి ఎవరిని ఎలా ఎక్కడ వాడుకోవాలో బాగా తెలుసు. సాధారణంగా నయనతార షూటింగ్స్ మాత్రమే చేస్తుంది. ప్రమోషన్స్ కి నో అంటుంది. అలాంటిది ఆమెను షూట్ స్టార్ట్ చేయడానికి ముందే ఒక క్రేజీ వీడియో చేసి సినిమాపై మరింత బజ్ పెంచాడు అనిల్. నయన్ వీడియో మెగా ఫ్యాన్స్ తో పాటు కామన్ ఆడియన్స్ కి బాగా నచ్చేసింది. మొత్తానికి నయనతార తిరిగి తెలుగు సినిమాల్లో నటించడం ఆమెకు ఫుల్ ఖుషి అందిస్తుందని తెలుస్తుంది. మరి అమ్మడు ఇక్కడ మరిన్ని సినిమాలు చేస్తుందా లేదా అన్నది చూడాలి. ప్రస్తుతం తమిళ్ లో కూడా బిజీ హీరోయిన్ గా ఉన్న నయనతార తెలుగులో కూడా వరుస సినిమాలు చేయాలని చూస్తుంది. తెలుగు, తమిళ్ మాత్రమేనా హిందీ నుంచి కూడా నయనతారకు ఆఫర్లు వస్తున్నాయని తెలుస్తుంది.

## జిమ్ నుంచి వెళుతూ పూజా చిక్కిందిలా

టాలీవుడ్ లో అవకాశాలు ముఖం చాటేసినా, కోలీవుడ్ లో వరుస అవకాశాలు అందుకుంటోంది పూజా హెగ్డే. అటు బాలీవుడ్ లోను ఈ భామకు అవకాశాలకు కొదవేమీ లేదు. ప్రస్తుతం జన నాయగన్ అనే చిత్రంలో దళపతి విజయ్ సరసన నటిస్తోంది. కోలీవుడ్ బాలీవుడ్ ని బ్యాలెన్స్ చేస్తూ ఈ అమ్మడు నిరంతర విమాన ప్రయాణాలు చేస్తోంది. పూజా ఓ వైపు చెన్నై టు ముంబై ప్రయాణాలతో బిజీగా ఉన్నా, జిమ్ యోగా సెషన్స్ ని మాత్రం విడిచిపెట్టడం లేదు. ఫిట్నెస్



ఫ్రీక్ నిరంతరం జిమ్ కి వెళుతోంది. తాజాగా ముంబై శాంటాక్రజ్ లో జిమ్ ముగించి ఇంటికి వెళుతూ పూజా ఫోటోగ్రాఫర్ల కంట పడింది. పూజా బ్లాక్ కలర్ బాడీ ఫిట్ స్పోర్ట్స్ దుస్తుల్లో కనిపించింది. అయితే తన భుజంపై పింక్ కలర్ పట్టీ దేనికో చెప్పనే లేదు. చేతికి వైట్ హ్యాండ్ బ్యాగ్, కాళ్లకు వైట్ స్పోర్ట్స్ షూస్ ధరించి కనిపించింది. అలా జిమ్ నుంచి బయటకు వచ్చి కార్ వైపు వెళుతున్న పూజాను ఫోటోగ్రాఫర్లు కొన్ని క్లిక్స్ కి సహకరించాల్సిందిగా కోరుతున్నారు. కానీ పూజా వారితో మాట్లాడుతూనే కార్ ఎక్కి వెళ్లిపోయింది. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది. పూజా సింపుల్ గా మేకప్ లెస్ లుక్ లో కనిపించింది. జిమ్‌లో కఠినంగా శ్రమించిందని తన రూపం చెబుతోంది. పూజాలోని ఈ డెడికేషన్ తన టోన్డ్ ఫిట్ బాడీని హైలైట్ చేస్తోంది. ఇటీవలే సమంత ముంబై బాంద్రాలో జిమ్ నుంచి వెళుతూ కెమెరాల కంటికి చిక్కింది. ఇదే సెలబ్రిటీ ఏరియాలో మలైకా, ప్రగ్య జైశ్వాల్, రకుల్ ప్రీత్ లాంటి భామలు జిమ్ లో కుస్తీలు పడుతూ ఫోలోలకు ఫోజులివ్వడం చూస్తున్నదే. ఇక కెరీర్ మ్యాటర్ కి వస్తే... పూజా నటించిన జననాయగన్ వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 9న విడుదల కానుంది.




## సంస్థాగతంగా పార్టీ బలోపేతం, డీసీసీల నియామకంపై వీరిచ్చే రిపోర్టే కీలకం

హైదరాబాద్ : తెలంగాణలో పార్లమెంట్ నియోజకవర్గాల వారిగా ఇప్పటికే పీసీసీ అబ్జర్వర్లను నియమించిన పార్టీ హైకమాండ్, ఇప్పుడు ఏఐసీసీ తరఫున రాష్ట్రంలో జిల్లాకో అబ్జర్వర్ నియామకంపై దృష్టి పెట్టింది. త్వరలో లోకల్ బాడీ ఎన్నికలకు ప్రభుత్వం రెడీ అవుతుండడంతో ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటేందుకు పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై ఇన్ చార్జ్ మీనాక్షి నటరాజన్ దృష్టి పెట్టారు. జిల్లాల వారిగా పార్టీ పరిస్థితి ఎలా ఉంది, నాయకుల మధ్య సమన్వయం ఉందా, లేదా...డీసీసీ అధ్యక్షులుగా ఎవరిని నియమిస్తే బాగుంటుంది, ప్రభుత్వ సంక్షేమ పథకాలు జనంలోకి ఎలా వెళ్తున్నాయి..వంటి పూర్తి వివరాలను ఏఐసీసీ అబ్జర్వర్లు ఇటు ఇన్?చార్జ్ మీనాక్షి నటరాజన్ కు పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ కు పంపించనున్నారు. ఈ నివేదిక ఆధారంగానే ఆ ఇద్దరు నేతలు డీసీసీ చీఫ్ లను నియమించనున్నారు. ఇప్పటికే పీసీసీ అబ్జర్వర్లు ఈ అంశాలపై మీనాక్షి నటరాజన్ కు, మహేశ్ గౌడ్ కు నివేదికలు ఇచారు. ఏఐసీసీ అబ్జర్వర్లు ఇచ్చే నివేదికతో వీటిని సరిపోల్చుకొని ఫైనల్ నిర్ణయం తీసుకోనున్నారు. మొత్తం 33 జిల్లాలకు అబ్జర్వర్లను నియమించనున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన సీనియర్ నేతలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు మాత్రమే ఏఐసీసీ అబ్జర్వర్లుగా ఇక్కడకు రానున్నారు. దీంతో పార్టీకి నిబద్ధతతో పనిచేసే వారినే డీసీసీ ప్రెసిడెంట్?గా నియమించాలని ఏఐసీసీ అబ్జర్వర్లు హైకమాండ్ కు సిఫారసు చేయనున్నారు. ఇతర రాష్ట్రాల నేతలు ఇక్కడకు ఏఐసీసీ అబ్జర్వర్లుగా వస్తున్నందున స్థానిక నేతల లాబీయింగ్ కు చెక్ పడనుందని పీసీసీలో చర్చ సాగుతోంది. జనంలో ఉన్న నేతలకే, పార్టీ కోసం పనిచేసే వారికే ఈ అబ్జర్వర్లు సిఫారసు చేసే అవకాశం ఉంటుందని కాంగ్రెస్ నేతలు అంటున్నారు



## అంతా కేసీఆర్ కనుసన్నల్లోనే.. గోనె ప్రకాశ్ రావు సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్ : ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులు దర్యాప్తును వేగవంతం చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఫోన్లు ట్యాపింగ్‌కు గురైన నేతలను వరుసగా విచారణకు పిలిచి వారిచ్చే స్టేట్‌మెంట్లను రికార్డు చేస్తున్నారు. ఈ క్రమంలోనే మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్ రావు ఫోన్ కూడా ట్యాపింగ్‌కు గురైందని గుర్తించారు. దీంతో ఆయనను సాక్షిగా వాంగ్మూలం ఇచ్చేందుకు రావాలని కోరారు. అధికారు అభ్యర్థన మేరకు ఇవాళ ఆయన ఉదయం 10.30కి జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి సిట్ అధికారులకు స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఈ క్రమంలోనే ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్ తతంగమంతా బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కనుసన్నల్లోనే జరిగిందని అన్నారు. ప్రభాకర్ రావు ఫోన్ ట్యాపింగ్ చేసి ఆ ఆడియోలను కేసీఆర్‌తో పాటు సంతోష్ రావులకు ఇచ్చారని తెలిపారు. నాడు ఓటుకు నోటు అంశం కూడా ఈ ఫోన్ ట్యాపింగ్ ద్వారానే వెలుగులోకి వచ్చిందని కామెంట్ చేశారు. అదేవిధంగా సొంత పార్టీ నేతలు ఎమ్మెల్సీ కవిత, పైలెట్ రోహిత్ రెడ్డి, రేగా కాంతారావు ఫోన్లకు కూడా ట్యాప్ చేశారని ఆరోపించారు. రాష్ట్రంలోని పెద్ద పెద్ద బిజినెస్‌మెన్లు, సినిమా వాళ్ల ఫోన్లను కూడా వదిలిపెట్టలేదని అన్నారు. ఎలాగైనా హ్యాట్రిక్ విజయం సాధించి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు విచ్చలవిడిగా ఫోన్ ట్యాపింగ్ చేశారని ఫైర్ అయ్యారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఫోన్ ట్యాపింగ్ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిందని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా ఫోన్ ట్యాపింగ్ అంశంపై విచారణ జరిపించాలని గోనె ప్రకాశ్ రావు డిమాండ్ చేశారు.

## బల్కంపేట ఎల్లమ్మకు నీతా అంబానీ భారీ విరాళం





హైదరాబాద్, జూన్ 20: నగరంలో ప్రసిద్ధి చెందిన బల్కంపేట ఎల్లమ్మ ఆలయానికి ప్రముఖ వ్యాపారవేత్త ముఖేష్ అంబానీ భార్య నీతా అంబానీ భారీ విరాళం అందజేశారు. ఎల్లమ్మ గుడికి కోటి రూపాయల విరాళం అందించారు నీతా అంబానీ. నేరుగా టెంపుల్ బ్యాంక్ ఖాతాకు విరాళాన్ని ట్రాన్స్‌ఫర్ చేశారు. గత ఏప్రిల్ నెలలో నీతా అంబానీ తల్లి పూర్ణిమ, సోదరి మమతా దలాల్ బల్కంపేట ఎల్లమ్మ ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గుడి విశిష్టతను వారికి తెలియజేశారు ఆలయ అధికారులు. అంతేకాకుండా ఆలయ అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. ఆలయ అధికారుల వినతిని తల్లి పూర్ణిమ నేరుగా నీతా అంబానీకి తెలియజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన నీతా అంబానీ ఆలయ అభివృద్ధి కోసం కోటి రూపాయలను విరాళంగా అమ్మవారి గుడి బ్యాంక్ ఖాతాలో వేశారు. ఈ మొత్తాన్ని ఫిక్సిడ్ డిపాజిట్ చేసి.. వచ్చే వడ్డీతో నిత్యాన్నదానం చేయాలని నిర్ణయించినట్లు టెంపుల్ కమిటీ సభ్యులు తెలియజేశారు. ఇంతటి భారీ విరాళాన్ని అందించిన నీతా అంబానీ కుటుంబసభ్యులకు ఆలయ అధికారులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇక బల్కంపేట్ ఎల్లమ్మ తల్లికి నీతా అంబానీ భక్తురాలు అన్న విషయం అందిరికీ తెలిసిందే. నగరానికి ఎప్పుడు వచ్చినా కూడా ఎల్లమ్మను దర్శించుకుని వెళ్తుంటారు నీతా అంబానీ. ఈ క్రమంలో గత నెలలో నీతా అంబానీ తల్లి, సోదరి ఎల్లమ్మను దర్శించుకున్న సమయంలో ఆలయ అభివృద్ధి సహకరించాలని అధికారులు కోరారు. తల్లి కోరిక మేరకు.. అలాగే ఎల్లమ్మకు నీతా అంబానీ భక్తురాలు కావడంతో కోటి రూపాయల విరాళాన్ని ఆలయానికి అందజేశారు. అంతేకాకుండా దేశంలోని ప్రముఖ ఆలయాలను కూడా నీతా అంబానీ దర్శించుకుని భారీ విరాళాలు సమర్పించడం తెలిసిందే.




హైదరాబాద్: నగరంలోని ఎల్బీ స్టేడియంలో అంతర్జాతీయ యోగా దినోత్సవానికి కౌంట్‌డౌన్ నిర్వహించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందులో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఎంపీ ఈటల రాజేందర్, భాజపా నేత ఖుష్బూ, సినీనటులు సాయి దుర్గాతేజ్, తేజా సజ్జ, మీనాక్షి చౌదరి పాల్గొని యోగాసనాలు వేశారు. కార్యక్రమానికి నగరవాసులు పెద్దఎత్తున తరలివచ్చారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం నేపథ్యంలో దీన్ని నిర్వహించారు.

## ప్రభుత్వాసుపత్రిలో సౌకర్యాలు కల్పించాలంటూ పిల్.. వైద్య ఆరోగ్య శాఖకు నోటీసులు

హైదరాబాద్: అలంపూర్ చౌరస్తాలోని ప్రభుత్వాసుపత్రిలో సౌకర్యాలు కల్పించాలంటూ అయిజకు చెందిన రామచంద్రారెడ్డి తెలంగాణ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఆసుపత్రి ప్రారంభించి రెండేళ్లవుతున్నా సిబ్బంది, వైద్యులు, మౌలిక సదుపాయాలు లేవని పిటిషనర్ పేర్కొన్నారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు చోటు చేసుకున్న సమయంలో క్షతగాత్రులకు వైద్యం అందించేందుకు ఆసుపత్రి ఉపయోగపడుతుందని చెప్పారు. ఈక్రమంలో వాదనలు విన్న సీజే ధర్మాసనం వైద్య ఆరోగ్యశాఖకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది.






హైదరాబాద్: కాంగ్రెస్, భారాస పార్టీలు పరస్పర అవగాహనతో ముందుకెళ్తున్నాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజాప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారాస పాలనలో జరిగిన అవినీతిపై ప్రజలకు వివరించాలని పార్టీ నేతలకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయని ఆరు గ్యారంటీల గురించి ప్రజలకు చెప్పాలన్నారు. రాష్ట్రాన్ని రక్షించాలంటే భాజపా ప్రభుత్వం రావాలని.. ప్రజలకు విశ్వాసం కల్పించి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ సహకారం లేకపోతే అభివృద్ధి కార్యక్రమాలు జరగవని పేర్కొన్నారు. కేంద్రం సాయంతోనే సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని కిషన్‌రెడ్డి వివరించారు.




వాషింగ్టన్: ఇజ్రాయెల్, ఇరాన్ పరస్పర దాడులతో పశ్చిమాసియా భగ్గుమంటోంది. ఇరాన్‌పై సైనిక చర్య చేపట్టేందుకు అగ్రరాజ్యం అమెరికా సిద్ధమవుతున్నట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ విషయంలో రెండు వారాల్లోపు అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయం తీసుకుంటారని వైట్‌హౌస్ స్పష్టంచేసింది. ఈ నేపథ్యంలో ఖతర్‌లోని ఎయిర్‌బేస్‌లో ఉన్న అమెరికా మిలిటరీ విమానాలు ఒక్కొక్కటిగా అదృశ్యమవుతున్నట్లు ఉపగ్రహ చిత్రాలు చూపిస్తున్నాయని అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. ఈమేరకు గత రెండు వారాల నుంచి దాదాపు 40 మిలిటరీ విమానాలు అదృశ్యమైన శాటిలైట్ చిత్రాలు బయటకు వచ్చాయి. ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం తీవ్రమవుతుండడంతో ఇరాన్ దాడుల నుంచి తమ ఆస్తులను రక్షించుకోవడం కోసమే అమెరికా వాటిని తరలించి ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. జూన్ 5న ప్లానెట్ ల్యాబ్స్ నుంచి వచ్చిన ఉపగ్రహ చిత్రాలు అల్ ఉదీద్ ఎయిర్ బేస్ వద్ద దాదాపు 40 సైనిక విమానాలను చూపించాయని అంతర్జాతీయ మీడియా తెలిపింది. వీటిలో హెర్క్యులస్ C-130 వంటి రవాణా విమానాలు, నిఘా విమానాలు ఉన్నట్లు పేర్కొంది.

అయితే జూన్ 19న విడుదల చేసిన మరో చిత్రంలో ఆ ప్రాంతంలో మూడు విమానాలు మాత్రమే కనిపిస్తున్నట్లు వెల్లడించింది. అక్కడ ఉన్న విమానాలను హ్యాంగర్‌లలోకి గాని.. లేదా ఆ ప్రాంతంలోని ఇతర స్థావరాలకు గానీ తరలించి ఉండవచ్చని అనుమానం వ్యక్తంచేసింది. అల్ ఉదీద్ స్థావరం ఇరాన్ సమీపంలో ఉండటం వల్ల అక్కడ ఉన్న యూఎస్ విమానాలు, సిబ్బందిపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉన్నట్లు అమెరికా ఆర్మీ లెఫ్టినెంట్ జనరల్, రక్షణ పరిశోధకుడు మార్క్ స్క్వార్ట్జ్ తెలిపినట్లు మీడియా పేర్కొంది. ఈ ప్రమాదాలను నివారించడానికి తాము కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఉద్రిక్త పరిస్థితుల్లో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఖతార్‌లోని యూఎస్ రాయబార కార్యాలయం గురువారం తమ సిబ్బందికి ఆదేశాలు జారీ చేసింది. ఇజ్రాయెల్- ఇరాన్‌ల మధ్య కొనసాగుతున్న యుద్ధం నేపథ్యంలో అమెరికా ఏదైనా చర్య తీసుకుంటే ఖతార్‌లోని యూస్ స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ దాడులకు పాల్పడే అవకాశం ఉండడంతో ఈ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులకు మద్దతివ్వాలా? వద్దా? అనే విషయంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రెండు వారాల్లో నిర్ణయం తీసుకుంటారని వైట్‌హౌస్ ప్రకటించడం, మిలిటరీ విమానాలను తరలించడం వంటి పరిస్థితుల నేపథ్యంలో అగ్రరాజ్యం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందనే విషయంపై సర్వత్రా ఆందోళన నెలకొంది.




హైదరాబాద్: కేంద్ర మంత్రి బండి సంజయ్ సన్నిహితులు, సిబ్బంది ఫోన్లు సైతం గతంలో ట్యాపింగ్‌కు గురయ్యాయి. సిట్ విచారణలో దీనికి సంబంధించిన విషయాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. కరీంనగర్ భాజపా కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్‌రావు ఫోన్‌ను ట్యాప్ చేసినట్లు నిర్ధరణ అయింది. ఈ నేపథ్యంలో పోలీసులు ఆయనకు ఫోన్ చేశారు. నోటీసులు పంపిస్తామని.. వచ్చి వివరణ ఇవ్వాలని జూబ్లీహిల్స్ పోలీసులు కోరారు. భారాస హయాంలో జరిగిన టెన్త్ పేపర్ లీకేజీ, బైంసా అల్లర్లు సహా పలు ఘటనల సమయంలో బండి సంజయ్ వెంటే ప్రవీణ్‌రావు ఉన్నారు. భారాస హయాంలో తమ ఫోన్లను ట్యాప్ చేశారంటూ ఇప్పటికే పలువురు కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ అంశంపై సిట్ విచారణ కొనసాగుతోంది. భారాస ప్రభుత్వంలో పనిచేసిన పలువురు అధికారులను విచారిస్తున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఇప్పటికే విచారణకు హాజరయ్యారు. ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల సైతం తమ ఫోన్లు ట్యాప్ చేశారని ఆరోపించారు.




ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధంతో పశ్చిమాసియా రణరంగంగా మారింది. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. టెల్‌అవీవ్‌తో యుద్ధంలో ఇరాన్‌కు చైనా రహస్యంగా సాయం చేస్తున్నట్లు తెలుస్తోంది. డ్రాగన్‌కు చెందిన పలు బోయింగ్ విమానాల్లో ఇరాన్‌కు ఆయుధాలు తరలిపోతున్నట్లు సమాచారం. ఫ్లైట్ ట్రాకర్ డేటా, యూరోపియన్ ఇంటెలిజెన్స్‌ను ఉటంకిస్తూ ఫాక్స్ న్యూస్ తన కథనంలో పేర్కొంది. జూన్ 14 నుంచి దాదాపు ఐదు బోయింగ్-747 విమానాలు చైనాలోని వివిధ ప్రాంతాల నుంచి బయలుదేరాయి. అవి కజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్, తుర్క్మెనిస్థాన్ మీదుగా ప్రయాణించి ఇరాన్ వైమానిక ప్రాంతానికి చేరుకున్నాయి.

అక్కడి నుంచి అవి ఎటువెళ్లాయనేది తెలియలేదు. అయితే, విమాన గమ్యస్థానాలు లక్సెంబర్గ్ కాగా.. అవి అసలు యూరోపియన్ గగనతలంలోకి ప్రవేశించకపోవడం గమనార్హం. సాధారణంగా ఈ రకం విమానాలను రవాణా కోసం వినియోగిస్తారు. ఈ నేపథ్యంలో ఇరాన్‌కు డ్రాగన్ మిలిటరీ సాయం అందిస్తుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తన దీర్ఘకాల మిత్రదేశమైన టెహ్రాన్‌కు బీజింగ్ సాయం చేసే అవకాశం లేకపోలేదని పలువురు నిపుణులు కూడా పేర్కొంటున్నారు. కాగా.. చైనా నుంచి ఇరాన్‌కు వెళ్తున్నట్లు అనుమానిస్తున్న బోయింగ్-747 విమానాలతో తమకెలాంటి సంబంధం లేదని లక్సెంబర్గ్‌కు చెందిన కార్గో విమానయాన సంస్థ కార్గోలక్స్ వెల్లడించింది. ఈమేరకు తన అధికారిక సామాజిక మాధ్యమాల్లో ఓ ప్రకటనను విడుదల చేసింది. అందులో తన విమానాలు ఏవీ ఇరాన్ గగనతలాన్ని ఉపయోగించుకోవని కార్గోలక్స్ తెలిపింది. తమ ఎయిర్‌లైన్ కార్యకలాపాలు పూర్తిగా పారదర్శకంగా ఉన్నాయని వెల్లడించింది. ఇదిలాఉండగా.. అణుస్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులు చేస్తుండగా.. ఇరాన్ భారీగా క్షిపణులను ప్రయోగిస్తుంది. ఇవి పౌర నివాసాలను తాకడంతో టెల్‌అవీవ్‌లోనూ అనేకమంది పౌరులు గాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇరాన్‌పై దాడికి అమెరికా కూడా సిద్ధమవుతున్నట్లు వస్తున్న వార్తలు ఈ ఉద్రిక్తతలను మరింత తీవ్రతరం చేశాయి. అయితే, టెహ్రాన్ అణుస్థావరాలపై దాడి విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండు వారాల్లో నిర్ణయం తీసుకుంటారని వైట్‌హౌస్ పేర్కొంది.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com